Follow: @ANNTELUGU

25-03-2026

# మహా పత్రిక

తెలుగు

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 87 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఎల్బీనగర్-హయత్ నగర్ మధ్య డబుల్ డెక్కర్ కారిడార్

### మూడు గంటల్లో బెజవాడకు రయ్ రయ్

నాగపూర్ తరహాలో ఎలివేటెడ్ రహదారి

కేంద్ర వార్షిక ప్రణాళికలో చేర్చాక డీపీఆర్ సిద్ధం!

**హైదరాబాద్, మహా.:**

హైదరాబాద్ మహానగరంలో అత్యంత రద్దీగా ఉండే ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు ప్రయాణం ఇకపై సాఫీగా సాగనుంది. ఈ మార్గంలో ట్రాఫిక్ నరకాన్ని వదిలించేందుకు ప్రభుత్వం వినూత్నమైన 'డబుల్ డెక్కర్' రహదారి నిర్మాణానికి కసరత్తు చేస్తోంది. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ ప్రాజెక్టుపై కీలక ప్రకటన చేశారు. నాగపూర్ తరహాలో ఈ కారిడార్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు.

**12 లక్షల మంది ప్రజల ఆశలు**

ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ పరిధిలో సుమారు 65 కాలనీలు ఉన్నాయని, దాదాపు 12 లక్షల మంది జనాభా ఈ రహదారిపైనే

మిగతా 2లో

**టాప్ న్యూస్**



ఇది తెలుగుదేశం పార్టీ

### 3.0 వెర్షన్

- మధ్యవర్తులు ఉండరు
- ఏపీ మంత్రి నారా లోకేశ్

02



### రాజకీయాల్లో ఎందుకు ఉన్నామా అనిపిస్తోంది

- మాజీ మంత్రి తలసాని

02



మంత్రి పదవిస్తే సర్కారుకు

### మంచి పేరు

- రేవంత్‌రెడ్డితో విబేధాల్లేవు
- కాంగ్రెస్‌కు మళ్లీ అధికారం రావాలంటే.. నా సేవలు అవసరం
- అసెంబ్లీ లాబీల్లో రాజగోపాల్ ఆసక్తికర వ్యాఖ్యలు!

02

# కేసీఆర్ శత్రువు కాదు.. కేవలం ప్రత్యర్థి

## ఆ విలన్ల వల్లే నేను హీరో అయ్యా

ఒక్క దెబ్బకు రెండు పిట్టలు.. బీఆర్ఎస్, బీజేపీలకు చెక్ పెడతా

2034 వరకు నాదే అధికారం.. దక్షిణాదిపై కేంద్రం వివక్ష

ఢిల్లీ వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ఢిల్లీ, మహా:** కేసీఆర్ తనకు వ్యక్తిగత శత్రువు కాదని, కేవలం రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఓ ప్రైవేట్ ఛానల్ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.''కేసీఆర్ ఎదుర్కొంటున్నది రాజకీయ సమస్య కాదు, అది పూర్తిగా వారి కుటుంబ సమస్య. పదవుల కోసం కేటీఆర్, కూతురు పోటీ పడుతున్నారు. గతంలో హరీష్ రావు ముఖ్యమంత్రి అవుతారన్న చర్చ కూడా అందుకే వచ్చింది'' అని విమర్శించారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై కేటీఆర్ మాట్లాడితే, బడ్జెట్‌పై హరీష్ రావు మాట్లాడుతున్నారని.. వారి మధ్య సమన్వయం లేదని వేలెత్తి చూపారు. బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో ఉనికి కోల్పోతోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుండు సున్నా వచ్చిందని, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సమయంలో కేటీఆర్ బెట్టింగులు కట్టించారని, అయినా అక్కడ ఓటమి తప్పలేదని రేవంత్ ఆరోపించారు. ''నా లెక్క ఎప్పుడూ ఒకటే.. ఒక దెబ్బకు రెండు పిట్టలు.. వచ్చే ఎన్నికల్లో అటు బీఆర్ఎస్‌ను, ఇటు బీజేపీని రెండింటినీ ఓడించి తీరుతాం''

మిగతా 2లో

### 2034 దాకా నేనే

*రాబోయే ఎన్నికల్లో 'ఒక్క దెబ్బకు రెండు పిట్టలు' అన్న చందంగా అటు బీఆర్ఎస్ పార్టీని, ఇటు బీజేపీని సమాధి చేస్తామన్న రేవంత్ రెడ్డి ధీమా ఆయన ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. తెలంగాణలో 2024 నుంచి 2034 వరకు అంటే మరో పదేళ్ల పాటు కాంగ్రెస్ జెండానే రెపరెపలాడుతుందని ఆయన జోస్యం చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో వారసత్వ యుద్ధం నడుస్తోందని, కేటీఆర్-కవిత మధ్య కుర్చీలాట సాగుతోందని వ్యాఖ్యానించారు.*



## విద్యార్థులకు ఫోన్ వాడకం గంటే!

- డిజిటల్ వ్యసనానికి చెక్ పెట్టేలా కర్ణాటక సర్కారు నిర్ణయాలు
- రాత్రి 7 దాటితే ఫోన్లలో ఇంటర్నెట్ బంద్ అయ్యేలా చైల్డ్ ప్లాన్

**బెంగళూరు,మహా:** ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు స్మార్ట్ ఫోన్లకు తీవ్రంగా బానిసలవుతున్న (అడిక్ట్) తీరుపై కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయాలకు సిద్ధమైంది. ఇంటర్నెట్ వ్యసనం నుంచి పిల్లలను బయటపడేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత విప్లవాత్మకమైన మార్గదర్శకాలతో ఒక ముసాయిదాను (డ్రాఫ్ట్) అధికారికంగా విడుదల చేసింది.

మిగతా 2లో



## ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్

### పశ్చిమాసియా సంక్షోభంపై అగ్రనేతల సమాలోచన

ప్రపంచ శాంతికి భారత్ మద్దతు అవసరం

**ఢిల్లీ, మహా:** పశ్చిమాసియాలో గత కొంతకాలంగా నెలకొన్న అస్థిరత ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్న తరుణంలో, భారత ప్రధాని నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం ఫోన్ చేయయడం ప్రాధాన్యత సంతరించుకుంది. యుద్ధం తర్వాత ఎదురవుతున్న పరిణామాలపై మోదీతో ట్రంప్ పంచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ సరఫరాకు గుండెకాయ వంటి ఈ జలసంధిలో ఉద్రిక్తతలు తగ్గకపోతే, అది ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభానికి దారితీస్తుందని ఇద్దరు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు భారత్ పోషిస్తున్న నిర్మాణాత్మక పాత్రను ఈ సందర్భంగా ట్రంప్ అభినందించారు. భారతదేశానికి సంబంధించి హార్ముజ్ జలసంధి అత్యంత కీలకమైన ప్రాంతం. దేశానికి రావాల్సిన వంటగ్యాస్ , చమురు నౌకలు ఈ మార్గం గుండానే ప్రయాణించాల్సి ఉంటుంది. ఇటీవల ఈ ప్రాంతంలో చోటుచేసుకున్న కొన్ని అవాంఛనీయ సంఘటనల నేపథ్యంలో, భారత నౌకల భద్రతపై ప్రధాని మోదీ తన ఆందోళనను వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన ట్రంప్, అంతర్జాతీయ జలాల్లో నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా

మిగతా 2లో

## నేరేడ్‌మెట్‌లో శంకర్ దాదా

- టెన్త్ కూడా పాస్ కాలేదు.. కానీ డెంటల్ డాక్టర్ అవతారం
- యూపీ 'రమేష్' ఘరానా మోసం!
- అర్హత లేని వైద్యుడి వద్ద చికిత్స పొందిన బాధితుల ఆందోళన!




వివరాలు 3లో



## పసిప్రాణాన్ని బలిగొన్న కన్నతండ్రి పంతం!

- సపోటా పండులో ఎలుకల మందు.. రెండేళ్ల మేఘన బలి
- యాదాద్రి జిల్లాలో ఘోరకలి!
- కుటుంబ కలహాల మధ్య నలిగిపోయిన పసిమొగ్గ
- చిన్నారిని చంపి తండ్రి ఆత్మహత్యాయత్నం
- నిలోఫర్‌లో చికిత్స పొందుతూ చిన్నారి మృతి
- కిరాతక తండ్రి రవిపై కేసు నమోదు!

సంస్థాన్ నారాయణపురం,మహా. కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే కన్నకూతురిని కడతేర్చాడు. పంతాలు, పట్టింపుల మధ్య పసిప్రాణాన్ని బలిగొని, తాను కూడా తనువు చాలించాలని ప్రయత్నించాడు.

మిగతా 2లో

## బీఆర్ఎస్ తీరుపై భట్టి ఫైర్



- బడ్జెట్ పత్రాల చింపివేతపై డిప్యూటీ సీఎం నిప్పులు
- విద్యార్థులకు 'అల్పాహారం'.. రైతులకు 'బోనస్' సంక్షేమమే ఊపిరిగా కాంగ్రెస్ బడ్జెట్!
- కోటి మంది మహిళల 'కోటీశ్వర' కల
- లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలతో మహాలక్ష్ములకు అండ
- పెండింగ్ బిల్లుల పాపం గతానిది.. చెల్లింపుల పుణ్యం మాది
- అసెంబ్లీ వేదికగా భట్టి విక్రమార్క విశ్లేషణ!

02



## అన్నా.. శ్రీధరన్నా...

- నేను ఎందుకు మేడ్చల్ ఎమ్మెల్యేగా ఉన్నానా అని బాధపడుతున్నా
- అసెంబ్లీలో మల్లారెడ్డి ఆవేదన
- జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ పై ప్రభుత్వానికి మొర

**హైదరాబాద్, మహా :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి.. శాసనసభ వేదికగా తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మేడ్చల్ నియోజకవర్గానికి అన్యాయం జరుగుతోందని అసెంబ్లీలో మొరపెట్టుకున్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలను కూడా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేశారని,

మిగతా 2లో

## భాగ్యనగరంలో వడగండ్ల వాన బీభత్సం

- ఒక్కసారిగా మారిన వాతావరణం
- షేక్‌పేటలో 51 మి.మీ నమోదు!
- ఉరుములు, మెరుపులతో ఉప్పెనలా కురిసిన వర్షం
- వడగండ్ల తాకిడికి బెంబేలెత్తిన నగరవాసులు!
- గంటల తరబడి నిలిచిన ట్రాఫిక్!
- గ్రామీణ జిల్లాల వైపు ఉగ్రరూపం
- వికారాబాద్, మహబూబ్‌నగర్‌లో హైఅలర్ట్!

వివరాలు 2లో

## చట్ట సభల్లో పెరగనున్న సీట్లు

### లోక్‌సభ, అసెంబ్లీలలో 50 శాతం పెంపు

మహిళా రిజర్వేషన్ అమలు.. ఆశావహులకు కేంద్రం గుడ్ న్యూస్

2029 ఎన్నికలకు వర్తింపు.. కీలక నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం

ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు



**న్యూఢిల్లీ, మహా :** దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ సీట్లను 50 శాతం మేర పెంచాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టేందుకు మోదీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ ప్రతిపాదన కనుక అమలైతే, లోక్‌సభ స్థానాల సంఖ్య 543 నుండి 816కి పెరుగుతుంది.

మిగతా 2లో



# కేసీఆర్ శత్రువు కాదు.. కేవలం ప్రత్యర్థి

(మొదటిపేజీ తరువాయి)

అని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న సంప్రదాయం ప్రకారం.. ప్రజలు తనకు 2024 నుంచి 2034 వరకు అవకాశం ఇస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**విలన్ల వల్లే హీరో అయ్యా**

రావణుడు లేనిదే రాముడి గొప్పతనం ప్రపంచానికి తెలిసేది కాదని, అలాగే తెలంగాణలో కేసీఆర్ వంటి బలమైన ప్రత్యర్థి ఉండటం వల్లే తనలోని నాయకత్వ లక్షణాలు, పోరాట పటిమ వెలుగులోకి వచ్చాయని ఆయన విశ్లేషించారు. విలన్ ఎంత బలంగా ఉంటే హీరో అంతగా ఎక్కుతారన్న సినీ ఫార్ములాను రాజకీయాలకు అన్వయిస్తూ, తనను అణచివేయాలని చూసిన శక్తులే తన విజయానికి సోపానాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇది కేవలం మాటల గారడీ కాదు, దశాబ్ద కాలంగా సాగిన కేసీఆర్ ఏకఛత్రాధిపత్యాన్ని కూకటివేళ్లతో పెకలించిన ఒక యోధుడి గెలుపు గర్వంలా కనిపించింది. తన రాజకీయ ప్రస్థానంలో ఎదురైన ఆటంకాలన్నీ తనను మరింత పటిష్టం చేశాయని, ఆ విలనీ లేకపోతే ఈ హీరోకు ఇంతటి ప్రజాదరణ దక్కేది కాదని ఆయన ముక్తాయించారు.

**దక్షిణాదిపై కేంద్రం వివక్ష**

కేవలం రాష్ట్ర రాజకీయాలకే పరిమితం కాకుండా, కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల పట్ల చూపుతున్న వివక్షపై రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. బీజేపీ సీనియర్ నేత వెంకయ్య నాయుడుకు జరిగిన అన్యాయాన్ని ప్రస్తావిస్తూ, దక్షిణాది నేతలను ఢిల్లీ పాలకుడు కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని ఆరోపించారు. వెంకయ్య నాయుడు వంటి మేధావిని రాష్ట్రపతిని చేయకుండా ఎందుకు పక్కన పెట్టారని ఆయన ప్రశ్నించడం ద్వారా, దక్షిణాది ఆత్మాభిమానం అనే అస్త్రాన్ని ప్రయోగించారు. దేశానికి రక్షణ, ఆర్థిక శాఖల వంటి కీలక పదవుల్లో దక్షిణాది వారికి చోటు కల్పించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ డీఎన్ఏలోనే పోరాటం ఉందని, నాటి నిజాంను ఎదిరించిన గడ్డ ఇదని గుర్తు చేస్తూ.. ఢిల్లీ పాలకుల వివక్షను ఎండగట్టడంలో తాను వెనకడుగు వేయబోనని స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ తీరుపై భట్టి ఫైర్



**హైదరాబాద్, మహా:** సంక్షేమ పథమే లక్ష్యం.. ప్రజా శ్రేయస్సే మార్గం: అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధ్వజం! తెలంగాణ శాసనసభ వేదికగా మంగళవారం బడ్జెట్ పై జరిగిన చర్చ అత్యంత ఆసక్తికరంగా, భావోద్వేగభరితంగా సాగింది. ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, తమ ప్రభుత్వ సంక్షేమ దిశను స్పష్టం చేశారు. గత పదేళ్లలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, వేల కోట్ల రూపాయల బిల్లులను పెండింగ్‌లో పెట్టి వెళ్లారని ఆయన మండిపడ్డారు. హాస్టళ్ల అద్దె బిల్లుల నుంచి కాంట్రాక్టర్ల పేమెంట్ల వరకు అన్నింటినీ తమ ప్రభుత్వం వచ్చాకే క్లియర్ చేస్తున్నామని ఆయన గణాంకాలతో వివరించారు. ముఖ్యంగా ఉద్యోగులకు సంబంధించిన రూ. 6,500 కోట్ల పెండింగ్ బిల్లులను చెల్లించి వారిలో భరోసా నింపామని, క్యాష్‌లెస్ హెల్త్ కార్డుల కోసం దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న వారి కలని నెరవేరుస్తున్నామని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని భట్టి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించడంతో పాటు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించడం చారిత్రక ఘట్టమని అభివర్ణించారు. విద్యార్థులకు మంచి ఆహారం అందిస్తుంటే ఓర్చుకోలేని స్థితిలో ప్రతిపక్షం ఉందని ఆయన ఎద్దేవా చేశారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థుల కోసం కాస్మోటిక్ ఛార్జీలను ఏకంగా 200 శాతం పెంచామని, అద్దె భవనాల్లో ఉన్న వసతి గృహాల నిధులను ప్రతి నెలా క్రమం తప్పకుండా విడుదల చేస్తామని బడ్జెట్ సాక్షిగా హామీ ఇచ్చారు. ఇది కేవలం అంకెల గారడీ కాదని, ప్రతి పేద విద్యార్థి ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. రైతు సంక్షేమం మరియు మహిళా సాధికారతపై భట్టి విక్రమార్క ప్రత్యేకంగా దృష్టి సారించారు. రైతులకు ఒకేసారి రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, ఉచిత విద్యుత్ పథకానికి పేటెంట్ హక్కు తమ పార్టీకే ఉందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రైతు భరోసాను కేవలం ఎన్నికల తాయిలంగా మార్చుకుందని, తాము మాత్రం ప్రతి క్వింటా ధాన్యానికి రూ. 500 అదనపు బోనస్ ఇచ్చి అన్నదాతను ఆదుకుంటున్నామని తెలిపారు. అదే విధంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో, స్వయం సహాయక సంఘాలకు రూ. లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అందించేందుకు సిద్ధమయ్యామని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అందుకే వారిని 'మహాలక్ష్మి'లుగా భావించి పెద్దపీట వేస్తున్నామని వివరించారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల తీరుపై డిప్యూటీ సీఎం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, ఇప్పుడు తాము బడ్జెట్ ప్రవేశపెడుతుంటే వినే ఓపిక లేక పత్రాలు చించి సభ నుంచి వెళ్లిపోవడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. 'ఆడలేక మద్దెల ఓడు' అన్న చందంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని చులకనగా చూడటం సరికాదని హితవు పలికారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి రావాల్సిన రూ. 10 వేల కోట్లను సాధించుకున్నామని, ప్రతి పైసాను పారదర్శకతతో ఖర్చు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందించడమే కాకుండా, కుటుంబంలోని పెద్ద మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకుండా ఉండేందుకు సమగ్ర బీమా సౌకర్యం కల్పిస్తున్నామని ప్రకటించారు.

## ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వెర్షన్

**మహా, అమరావతి:** "ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వర్షన్. పార్టీలో సమూల మార్పులు తీసుకువచ్చి, మరింత బలంగా ముందుకు వెళతాం" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే కార్యకర్తలను మధ్యవర్తులు లేకుండా నేరుగా గుర్తించడమే తమ లక్ష్యమని ఆయన ప్రకటించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇంఛార్జ్‌ల కోసం ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల్లో భాగంగా 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీని ఒక యూనివర్సిటీతో పోల్చిన లోకేశ్, ఎంతోమంది గొప్ప నాయకులను తయారుచేసిన కార్ఖానా అని అభివర్ణించారు. "తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, రెండో ముఖ్యమంత్రి కూడా మన తెలుగుదేశం యూనివర్సిటీ నుంచి వచ్చినవారే. గతంలో గండిపేటలో నిరంతరం శిక్షణా తరగతులు జరిగేవి. వాటి ద్వారా ఎంతోమంది ఉపముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలుగా ఎదిగారు. ఇప్పుడు ఏడాదికి కనీసం 300 రోజులు శిక్షణా తరగతులు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించారు. పదవులు ఇస్తున్నప్పటికీ, వారి బాధ్యతలేమిటో స్పష్టంగా చెప్పలేకపోతున్నామని, ఈ శిక్షణ ద్వారా ఆ లోటును భర్తీ చేస్తామని తెలిపారు.

# భాగ్యనగరంలో వడగండ్ల వాన బీభత్సం

- ఒక్కసారిగా మారిన వాతావరణం
- షేక్‌పేటలో 51 మి.మీ నమోదు!
- ఉరుములు, మెరుపులతో ఉప్పెనలా కురిసిన వర్షం
- వడగండ్ల తాకిడికి బెంబేలెత్తిన నగరవాసులు!
- గంటల తరబడి నిలిచిన ట్రాఫిక్!
- గ్రామీణ జిల్లాల వైపు ఉగ్రరూపం
- వికారాబాద్, మహబూబ్‌నగర్‌లో హైఅలర్ట్!



**హైదరాబాద్, మహా:** మంగళవారం సాయంత్రం వరకు భానుడి భగభగలతో అల్లాడిన హైదరాబాద్ మహానగరం, సాయంత్రం ఐదున్నర గంటల తర్వాత ఒక్కసారిగా మేఘావృతమైంది. అప్పటివరకు సాధారణంగా ఉన్న వాతావరణం క్షణాల్లో మారిపోయి, నగరంలోని పశ్చిమ భాగం నుంచి భారీ వర్షం విరుచుకుపడింది. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, నిజాంపేట్, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన గాలులు వీచాయి. దీనికి తోడు వడగండ్లు కూడా పడటంతో జనం ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. హైటెక్ సిటీ, గజులరామారం ప్రాంతాల్లో దాదాపు గంటన్నర పాటు కుండపోత వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం ప్రారంభం కావడంతో ఐటీ ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి ఎనిమిది గంటల సమయానికి వర్షం తీవ్రత తగ్గడంతో వాతావరణ శాఖ అధికారికంగా గణాంకాలను విడుదల చేసింది. ఈ వానా కాలపు షోలో షేక్‌పేట 51.3 మిల్లీమీటర్ల వర్షపాతంతో అగ్రస్థానంలో నిలిచింది. ఖాజాగూడలో 36.8 మి.మీ, మియాపూర్‌లో 33.3 మి.మీ, గచ్చిబౌలిలో 31.5 మి.మీ వర్షం కురిసింది. బాలానగర్, మూసాపేట్, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో కూడా 25 మి.మీ పైగా వర్షం నమోదైంది. ఈ భారీ వర్షం కారణంగా నగరంలోని పలు ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. ముఖ్యంగా అత్తాపూర్, శివరాంపల్లి, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల్లో మోకాళ్ల లోతు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జూబ్లీహిల్స్, ఫిరోజ్‌గూడ ప్రాంతాల్లో కూడా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసి నగరంలో ఉష్ణోగ్రతలను ఒక్కసారిగా తగ్గించింది.

నగరంలో వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ, గ్రామీణ తెలంగాణలో మాత్రం మేఘాలు ఉగ్రరూపం దాల్చాయి. వికారాబాద్ జిల్లాలో తీవ్రమైన ఉరుములతో కూడిన తుపాను కొనసాగుతుండగా, అది క్రమంగా నారాయణపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల వైపు మళ్లుతోందని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో మాత్రం రాత్రి వేళ చినుకులు పడే అవకాశం ఉందని, మిగిలిన జిల్లాల్లో పొడి వాతావరణం ఉంటుందని వెల్లడించారు. నగరంలో బుధవారం సాయంత్రం వరకు మళ్లీ వర్షం పడే అవకాశం లేదని, అయితే ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఇక సామాజిక మాధ్యమాల్లో వడగండ్ల వానపై వస్తున్న వింత వదంతులపై వాతావరణ నిపుణులు ఘాటుగా స్పందించారు. వడగండ్ల వాన అనేది సహజమైన ప్రక్రియ అని, దీనికి బిల్ గేట్స్ ప్రయోగాలకు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. వేసవి కాలం ప్రారంభంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు ఇలాంటి వడగండ్ల వానలు కురవడం సర్వసాధారణమని గుర్తు చేశారు. గతంలో 2023, 2024, 2025 సంవత్సరాల్లో కూడా మార్చి, ఏప్రిల్ నెలల్లో హైదరాబాద్‌లో ఇలాంటి వడగండ్ల వానలు కురిశాయని వారు ఉదహరించారు. ప్రజలు అనవసరపు భయాలకు లోనుకావద్దని, ఇవన్నీ కేవలం ప్రకృతి మార్పుల్లో భాగమేనని స్పష్టం చేశారు. భాగ్యనగరంలో ప్రస్తుతానికి వాన ముగిసినా, ఉక్కపోత నుంచి ఈ వర్షం తాత్కాలికంగా ఉపశమనాన్ని కలిగించింది.

## ఎల్బీనగర్-హయత్ నగర్ మధ్య డబుల్ డెక్కర్ కారిడార్

(మొదటిపేజీ తరువాయి)

ఆధారపడి ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో ఈ ప్రాజెక్టును చేర్చిన వెంటనే సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే మూడు, నాలుగు నెలల్లో అనుమతులు సాధించి, ఆరు నెలల్లో పనులు ప్రారంభించేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని సభ్యులకు హామీ ఇచ్చారు. విజయవాడకు కేవలం రెండు, మూడు గంటల్లోనే చేరుకునేలా ఈ డబుల్ డెక్కర్ రోడ్డు దోహదపడుతుందని వివరించారు.

**ప్రమాదాల నివారణే లక్ష్యం: సభ్యుల ఆందోళన**

చర్చలో భాగంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. విజయవాడ రహదారిపై కాలేజీలు, పాఠశాలలు ఎక్కువగా ఉన్నాయని, రోడ్డు దాటే క్రమంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని సభ దృష్టికి తెచ్చారు. రామోజీ ఫిల్మ్ సిటీ దాటిన తర్వాత కీలక ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. అదేవిధంగా తుక్కుగూడ నుంచి శ్రీశైలం వెళ్లే రహదారిని ఆరు లైన్ల రోడ్డుగా విస్తరించాలని, అక్కడ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తన నియోజకవర్గంలోని అధ్వాన్నపు రోడ్ల పరిస్థితిని వివరించి, కొత్త రోడ్ల మంజూరుకు కోరారు.

**మత సామరస్యం.. ట్రాఫిక్ నియంత్రణ**

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. పనామా వద్ద ఫ్లైఓవర్ మంజూరు చేసినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అయితే రహదారిపై ఉన్న దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద ట్రాఫిక్ జాం అవుతోందని, మత పెద్దలతో చర్చించి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయిస్తే రద్దీ తగ్గుతుందని సూచించారు. పనులు ఎప్పటి నుంచి మొదలవుతాయనే దానిపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

**అభివృద్ధి పథంలో తెలంగాణ రోడ్లు**

సభ్యుల ప్రశ్నలకు మంత్రి స్పందిస్తూ.. కేవలం నగరంపైనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోందని చెప్పారు. తెలంగాణను రోడ్డు ప్రమాద రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ నిధులు సాధిస్తామని, ప్రజల ప్రాణాలు కాపాడేందుకు అవసరమైన చోట ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్కైవాక్‌లు నిర్మిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

# చట్ట సభల్లో పెరగనున్న సీట్లు



(మొదటిపేజీ తరువాయి)

దేశంలోని మొత్తం అసెంబ్లీ స్థానాలు 4,123 నుండి 6,185కి పెరుగుతాయి. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేసేందుకు వీలుగా సంబంధిత చట్టాలకు సవరణలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఆ దిశగా కసరత్తు చేసి, కేంద్రం అడుగులు సైతం వేస్తోంది.

**ఏపీ, తెలంగాణలో ఎన్ని స్థానాలు..**

కేంద్రం నిర్ణయంతో తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రాతినిధ్యం భారీగా పెరగనుంది. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 స్థానాలు 26కి పెరుగుతాయి. ఏపీలో అసెంబ్లీ స్థానాలు 175 నుంచి 263, తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 119 నుండి 179కి చేరే అవకాశం ఉంది. ఈ అంశంపై ఇప్పటికే ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో పాటు విపక్షాలతోనూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో ప్రాథమిక చర్చలు జరిగాయి. 2027 మార్చి నాటికి జనగణన పూర్తి చేసి, ఆ లెక్కల ఆధారంగానే 2029 ఎన్నికల నాటికి ఈ కొత్త సీట్ల పెంపును అమలు చేయాలని మోదీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు చేపడితే ఉత్తరాది, దక్షిణ రాష్ట్రాల మధ్య రాజకీయ ప్రాతినిధ్యంలో వ్యత్యాసం వస్తుందన్న ఆందోళన కొనసాగుతోంది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్రం, అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు మేర పెంచాలని కొత్త వ్యూహాన్ని తెరపైకి తెచ్చింది. ఈ ప్రతిపాదనపై స్పందించేందుకు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో విపక్షాలు చర్చించాయి.

**లోక్‌సభ స్థానాలు ఏ రాష్ట్రంలో ఎన్ని..**

50 శాతం మేర లోక్‌సభ సీట్లు పెంపు జరిగితే కనుక ఎక్కువ ప్రయోజనం ఉత్తరప్రదేశ్‌కు కలుగుతుంది. యూపీలో 80 ఉన్న లోక్‌సభ సీట్లు 120 అవుతాయి. ఇందులో 40 సీట్లు మహిళలకు రిజర్వ్ చేయనున్నారు. మహారాష్ట్ర సీట్లు 48 నుండి 72కి పెరుగుతాయి. పశ్చిమ బెంగాల్ 42 నుండి 63కి, బీహార్ 40 నుండి 60కి, ఏపీలో లోక్‌సభ సీట్లు 25 నుంచి 38, తెలంగాణలో 17 నుంచి 26కి చేరతాయి. తమిళనాడులో లోక్‌సభ సీట్ల సంఖ్య 39 నుండి 59కి, మధ్యప్రదేశ్ లోక్‌సభ సీట్లు 29 నుండి 44కి పెరుగుతాయి. చిన్న రాష్ట్రాలలో, అరుణాచల్ ప్రదేశ్, గోవా, మణిపూర్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల లోక్‌సభ సీట్లు 2 నుండి 3కి పెరగవచ్చు. ప్రస్తుతం ఒక్కో సీటు ఉన్న మిజోరం, నాగాలాండ్, సిక్కిం రాష్ట్రాలకు 2 సీట్లు చొప్పున వచ్చే అవకాశం ఉంది. కేంద్రపాలిత ప్రాంతాలలో ఢిల్లీలో లోక్‌సభ సీట్లు 7 నుండి 11కి, జమ్మూ కాశ్మీర్ సీట్లు 5 నుండి 8కి పెరుగుతాయి. లడఖ్, పుదుచ్చేరి వంటి ఒకే సీటు ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలలో సీట్ల సంఖ్య పెరుగుతుందా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత లేదు.

**2029 ఎన్నికల నుంచే మార్పులు చేర్పులు..**

2023 సెప్టెంబరులో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రకారం, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు 2034 నుండి అమల్లోకి రావాలి. రాజ్యాంగంలోని అధికరణలు 170(3), 81(3) నిబంధనల మేరకు, 2026 తర్వాత వెలువడే జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. అయితే, తాజా పరిణామాల ప్రకారం 2027 మార్చి 1 నాటికి జనగణన ప్రక్రియ పూర్తి కానుంది. వెంటనే నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టే అవకాశం ఉంది. తద్వారా రిజర్వేషన్ల అమలును అనుకున్నదానికంటే ముందే పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలను ప్రారంభించింది.

## ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్

(మొదటిపేజీ తరువాయి)

అమెరికా తన వంతు సహకారాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. ముఖ్యంగా భారత్‌కు వస్తున్న 'జంగ్ వసంత్', 'పైన్ గ్యాస్' వంటి ఎల్పీజీ నౌకల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రాంతంలో నిఘాను మరింత కట్టుదిట్టం చేసే అంశంపై కూడా చర్చలు జరిగినట్లు సమాచారం. ఈ ఫోన్ సంభాషణ పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు చేపట్టాల్సిన చర్యలపై కూడా సాగింది. ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు యుద్ధానికి దారితీయకుండా చూడటంలో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల సహకారం ఎంతో అవసరమని ట్రంప్ పేర్కొన్నారు. ప్రపంచ శాంతి స్థాపనలో ప్రధాని మోడీ ఒక బలమైన మధ్యవర్తిగా వ్యవహరించగలరన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. దీనికి ప్రతిస్పందనగా, భారత్ ఎల్లప్పుడూ శాంతినే కోరుకుంటుందని, చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని మోడీ పునరుద్ఘాటించారు. దౌత్యపరమైన మార్గాల ద్వారా ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత్ తన వంతు ప్రయత్నం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## రాజకీయాల్లో ఎందుకు ఉన్నామా అనిపిస్తోంది

**మాజీ మంత్రి తలసాని**

**హైదరాబాద్, మహా :** శాసనసభలో జరుగుతున్న పరిణామాలను చూసి రాజకీయాల్లో ఎందుకు ఉన్నామా అని అనిపిస్తోందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అభిప్రాయపడ్డారు. తాను 1994లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, అప్పటి నుంచి అసెంబ్లీ తీరు ఇలా లేదని అన్నారు. ప్రధాన ప్రతిపక్షం నుంచి బడ్జెట్‌పై హరీశ్‌రావు మాట్లాడేటప్పుడు సభను రెండున్నర గంటల పాటు వాయిదా వేస్తూ "టీ విరామం" తీసుకున్నారని, సీఎం రేవంత్ రెడ్డి పరుషంగా చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించలేదని మండిపడ్డారు.

## అన్నా.. శ్రీధరన్నా...

(మొదటిపేజీ తరువాయి)

అయితే అక్కడ సరైన వసతులు లేవని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీలో ఉన్న చెత్తను మొత్తం తీసుకువచ్చి.. తన మేడ్చల్ నియోజకవర్గంలోని జవహర్ నగర్‌లో డంప్ చేసి.. చెత్తకుప్ప లాగా మార్చారని ఆరోపించారు. తన నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ నాలాలు, విద్యుత్ స్తంభాలు, అభివృద్ధి లేదని, రోడ్లు లేవని, లైట్లు లేవని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. స్పెషల్ కేటగిరీ కింద తమ మేడ్చల్ నియోజకవర్గానికి నిధులు కేటాయించాలని.. జిల్లా ఇంఛార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు దండం పెట్టి విజ్ఞప్తి చేశారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు కారణంగా అక్కడి పరిస్థితి ఇప్పుడు అత్యంత దారుణంగా తయారైందని మల్లారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం నలుమూలల నుంచి సేకరించిన చెత్త మొత్తాన్ని జవహర్ నగర్‌కే తీసుకువస్తున్నారని తెలిపారు. ఈ చెత్త కారణంగా అక్కడ నివసించే ప్రజలు వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అక్కడి వాతావరణం కారణంగా స్థానికులు ఆస్పత్రుల పాలు అవుతున్నారని మల్లారెడ్డి తెలిపారు. వాళ్లను చూసి తన మనసు చలించిపోతోందని పేర్కొన్నారు. తాను ఎందుకు మేడ్చల్ ఎమ్మెల్యేగా ఉన్నానా అని బాధపడుతున్నానని ఎమోషనల్ అయ్యారు. తక్షణమే ప్రభుత్వం జవహర్‌నగర్ డంపింగ్ యార్డును స్పెషల్ కేటగిరీ కింద డెవలప్ చేయాలని మల్లారెడ్డి కోరారు. దేశంలోనే నెంబర్ వన్ నియోజకవర్గమైన తన మేడ్చల్‌ను ముక్కలు చేశారని మల్లారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 61 గ్రామాలు.. 3 కార్పొరేషన్లు, 7 మున్సిపాలిటీలు ఉండేవి కానీ ప్రస్తుత ప్రభుత్వం వాటిని మొత్తం జీహెచ్ఎంసీలో కలిపి కేవలం 16 వార్డులుగా మార్చిందని ఆరోపించారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో పెంకుటిళ్లులే ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి శ్రీధర్ బాబును ఉద్దేశించి మాట్లాడిన మల్లారెడ్డి.. 'శ్రీధరన్నా.. జర నాపై పగబట్టకే.. మా జిల్లా ఇంఛార్జ్ మంత్రివి నువ్వే' అని విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులకు ఫోన్ వాడకం గంటే!

- డిజిటల్ వ్యసనానికి చెక్ పెట్టేలా కర్ణాటక సర్కారు నిర్ణయాలు
- రాత్రి 7 దాటితే ఫోన్లలో ఇంటర్నెట్ బంద్ అయ్యేలా చైల్డ్ ప్లాన్

(మొదటిపేజీ తరువాయి)

'డ్రాఫ్ట్ పాలసీ ఆన్ రెస్పాన్సిబుల్ డిజిటల్ యూజ్ అమంగ్ స్టూడెంట్స్' లేదా 'డిజిటల్ వెల్‌బీంగ్ పాలసీ' పేరుతో కర్ణాటక ఆరోగ్య, విద్యా శాఖలు, నిమ్హాన్స్ తదితర సంస్థలు సంయుక్తంగా ఈ ముసాయిదాను రూపొందించాయి. దీని ప్రకారం.. 9 నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులు ప్రతిరోజూ కేవలం ఒక గంట మాత్రమే ఫోన్ చూసేలా కఠిన పరిమితులు విధించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే, విద్యార్థుల రోజువారీ ప్రోగ్రెస్ గురించి స్కూళ్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయం చేసుకునేందుకు ప్రస్తుతం ఉపయోగిస్తున్న 'వాట్సాప్' గ్రూపులను రద్దు చేసి, తిరిగి పాతకాలపు 'స్కూల్ డైరీ' విధానాన్నే తప్పనిసరి చేయాలని అందులో పొందుపరిచారు.

**వయసును బట్టే కంటెంట్.. రాత్రి 7కే ఇంటర్నెట్ బంద్!**



ప్రస్తుతం 10 నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లల్లో దాదాపు 25 శాతం మంది ఇంటర్నెట్ వ్యసనం బారిన పడి తీవ్రమైన మానసిక ఆందోళన, నిద్రలేమి, ఏకాగ్రత లోపం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని పాలసీలో ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి చెక్ పెట్టేందుకు మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్‌లలోనే మార్పులు చేయాలని కర్ణాటక సర్కారు ప్రతిపాదించింది. పిల్లల వయసుకు తగిన కంటెంట్ మాత్రమే కనిపించేలా ఫోన్ల తయారీ జరగాలని, అలాగే రాత్రి 7 గంటలు కాగానే ఆటోమేటిక్‌గా ఇంటర్నెట్ ఆగిపోయేలా ఫోన్లలో ప్రత్యేకమైన సెట్టింగ్స్ (చైల్డ్ ప్లాన్) ఉండాలని సూచించింది. దీనివల్ల అర్ధరాత్రి దాకా నిద్ర మానుకుని ఫోన్లు చూసే అలవాటు నుంచి పిల్లలను రక్షించవచ్చని పేర్కొంది.

**పాఠ్యాంశంగా డిజిటల్ వెల్‌బీంగ్**

బాధ్యతాయుతంగా ఫోన్లను ఎలా ఉపయోగించాలనే దానిపై విద్యార్థులకు పాఠశాల దశ నుంచే అవగాహన కల్పించేలా 'ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ'ని కరికులమ్‌లో చేర్చాలని ముసాయిదాలో ప్రతిపాదించారు. ఆన్‌లైన్ భద్రత, ప్రైవసీ, డిజిటల్ ఫుట్‌ప్రింట్స్ తదితర అంశాలపై పాఠాలు బోధించనున్నారు. అలాగే, ప్రతి స్కూల్‌లోనూ ప్రిన్సిపాల్, కౌన్సిలర్, సైబర్ క్రైమ్ పోలీసులతో కూడిన 'డిజిటల్ వెల్‌నెస్ కమిటీ'లను ఏర్పాటు చేయాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్లకు బానిసలైన పిల్లలను గుర్తించి వారికి కౌన్సిలింగ్, మానసిక వైద్యుల సాయం అందించేలా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఫోన్లకు బదులు పిల్లలు క్రీడలు, పుస్తక పఠనం, కళల వైపు మొగ్గుచూపేలా ప్రోత్సహిస్తారు. అలాగే, ప్రతి స్కూల్‌లో కనీసం మూడు నెలలకోసారి 'టెక్ ఫ్రీ పీరియడ్స్', 'ఆఫ్ లైన్ జాయ్ డేస్' జరపాలని, నవంబర్ నెలను 'నో టెక్నాలజీ మంత్'గా, డిసెంబర్ 10ని 'డిజిటల్ డీటాక్స్ డే'గా పరిగణించాలని ముసాయిదాలో స్పష్టం చేశారు. ఇళ్లలోనూ తల్లిదండ్రులు పిల్లలకు ఫోన్ ఇచ్చే సమయాన్ని బాగా తగ్గించాలని, ఇళ్లలో 'డివైజ్ ఫ్రీ జోన్ల'ను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

# మంత్రి పదవిస్తే సర్కారుకు మంచి పేరు

- రేవంత్‌రెడ్డితో విబేధాల్లేవు
- కాంగ్రెస్‌కు మళ్లీ అధికారం రావాలంటే.. నా సేవలు అవసరం
- అసెంబ్లీ లాబీల్లో రాజగోపాల్ ఆసక్తికర వ్యాఖ్యలు!

**హైదరాబాద్, మహా:** తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరుగుతున్న తరుణంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన తన మనసులోని మాటను బయటపెట్టారు. తనకు మంత్రి పదవి దక్కితే కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను పార్టీలోకి వచ్చే సమయంలో అధిష్ఠానం మంత్రి పదవి విషయంలో స్పష్టమైన హామీ ఇచ్చిందని, ఆ హామీని నెరవేర్చే విషయంలో హైకమాండ్ ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలని ఆయన పేర్కొన్నారు. అయితే పదవుల కోసం తాను పాకులాడటం లేదని, ప్రజాక్షేత్రంలో తనకు ఇప్పటికే తగిన గుర్తింపు, గౌరవం ఉన్నాయని రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారాన్ని నిలబెట్టుకోవాలంటే తన వంటి ఉద్యమకారుల సేవలు ఎంతో అవసరమని రాజగోపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నిలబడిన నాయకులకు సరైన ప్రాధాన్యత కల్పిస్తేనే పార్టీ బలోపేతం అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో ప్రజల నాడి తెలిసిన నాయకుడిగా, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో తనదైన ముద్ర వేయగలనన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. పదవి ఉన్నా లేకున్నా తన నియోజకవర్గ ప్రజలతో తనకున్న అనుబంధం చెక్కుచెదరదని, ఎప్పుడూ వారి కోసం అందుబాటులో ఉంటానని ఆయన పునరుద్ఘాటించారు. కేవలం అధికారం కోసమే రాజకీయం చేసే వ్యక్తిని కాదని, నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడే స్వభావం తనదని ఆయన గుర్తు చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తనకు విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న వార్తలపై రాజగోపాల్‌రెడ్డి ఈ సందర్భంగా స్పష్టత ఇచ్చారు. ముఖ్యమంత్రితో తనకు ఎలాంటి ఇబ్బందులు లేవని, తమ మధ్య సత్సంబంధాలే ఉన్నాయని ఆయన వెల్లడించారు. సోమవారం ముఖ్యమంత్రితో జరిగిన భేటీపై వివరణ ఇస్తూ.. అది ఎటువంటి ప్రత్యేక సమావేశం కాదని, కేవలం యాదృచ్ఛికంగా ఎదురుపడి పలకరించుకున్నామని స్పష్టం చేశారు. దీనిపై జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని ఆయన కొట్టిపారేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయాల్లో తనదైన శైలిలో దూసుకుపోతున్న రాజగోపాల్‌రెడ్డి, మంత్రివర్గంలో చోటు దక్కితే జిల్లా అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురావచ్చన్న ఆశాభావంతో ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తానికి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు అటు అధిష్ఠానానికి తన పాత హామీని గుర్తు చేయడంతో పాటు, తన రాజకీయ శక్తిని చాటుకునే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. కేబినెట్ విస్తరణ ఎప్పుడు జరిగినా తన పేరు ఖచ్చితంగా పరిశీలనలో ఉంటుందని ఆయన విశ్వసిస్తున్నారు. అదే సమయంలో ముఖ్యమంత్రితో సఖ్యతగా ఉంటూనే తన వాణిని వినిపించడం ద్వారా అటు పార్టీ శ్రేణుల్లోనూ, ఇటు రాజకీయ విశ్లేషకుల్లోనూ ఆసక్తిని రేకెత్తించారు. రాజగోపాల్‌రెడ్డి వంటి కీలక నాయకుడికి మంత్రివర్గంలో చోటు దక్కుతుందా లేదా అనేది ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



## బీఆర్ఎస్ విద్యార్థి నేతలు అరెస్టు

**అక్రమ అరెస్టులతో ప్రభుత్వాన్ని నడపలేరు**

**మందమర్రి, మహా :** రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమ అరెస్టులతో ప్రభుత్వాన్ని నడపలేరని భారత రాష్ట్ర సమితి విద్యార్థి నేతలు తోట సురేందర్, మాసు వెంకటేష్, తిరుపతిరెడ్డి, అఖిలేష్ పాండే, మొగురం శ్రీనివాస్, ఉప్పల సత్యనారాయణలు స్పష్టం చేశారు. ఉన్నత విద్యలను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఫీజు ప్రియంబర్స్ మెంట్ చెల్లించడం లేదని నిరసిస్తూ మంగళవారం బీ.ఆర్.ఎస్.వీ. రాష్ట్ర కమిటీ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మందమర్రి పట్టణానికి చెందిన పలువురు నేతలను అక్రమ అరెస్టులు చేశారని విద్యార్థి నేతలు మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నడపలేరని మండిపడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థినేత తోట సురేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎవరికైనా ప్రభుత్వం హక్కులను అరిస్తే నిరసనలు తెలుపుకునే హక్కు ఉందని అన్నారు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే ఆరు గ్యారెంటీ లతో సహ 420 హామీలను నెరవేర్చాలని సురేందర్ డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీఏ ఇతరత్రా విద్య కోర్సులు పూర్తి చేసిన వారికి ఆయా విద్యాసంస్థలు ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని అన్నారు. ఈ విద్యార్థులు పై చదువు కొరకు కానీ ఇతర కంపెనీలో కాని పని చేయాలంటే చదువు పూర్తిచేసిన ఉత్తీర్ణత ధ్రువపత్రాలు అవసరమని వెల్లడించారు. అవి రాకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు రోడ్ల వెంట ఉద్యోగాల కొరకు తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయా నిధులను విడుదల చేసి విద్యార్థులకు బాసటగా నిలవాలని ఆయన కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

# నేరేడ్‌మెట్‌లో శంకర్ దాదా

- టెన్త్ కూడా పాస్ కాలేదు.. కానీ డెంటల్ డాక్టర్ అవతారం
- యూపీ 'రమేష్' ఘరానా మోసం!
- అర్హత లేని వైద్యుడి వద్ద చికిత్స పొందిన బాధితుల ఆందోళన!




**హైదరాబాద్, మహా:** అక్షరం ముక్క రాదు.. కానీ శస్త్రచికిత్సలు చేసేస్తాడు: నేరేడ్‌మెట్‌లో నకిలీ వైద్యుడి బాగోతం! మహానగరంలో మరో ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. కనీసం పదో తరగతి కూడా ఉత్తీర్ణం కాని ఓ వ్యక్తి, ఏకంగా దంత వైద్యుడి అవతారమెత్తి ఏళ్ల తరబడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాడు. ఒకరు కాదు ఇద్దరు కాదు, ఏకంగా రెండు దశాబ్దాల పాటు ఎవరికీ అనుమానం రాకుండా 'క్లినిక్' నడుపుతూ వైద్యం పేరిట అమాయక ప్రజలను నిలువునా ముంచాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రమేష్ అనే వ్యక్తి నకిలీ సర్టిఫికెట్లతో సాగించిన ఈ 'వైద్య' సామ్రాజ్యాన్ని మల్కాజ్‌గిరి పోలీసులు మరియు ఎస్ఓటీ బృందం ఎట్టకేలకు బట్టబయలు చేసింది.

**రాత్రి వేళల్లోనే 'రాజ్యం'.. పోలీసులకే షాక్!**

ఈ నకిలీ డాక్టర్ రమేష్ అనుసరించిన పద్ధతి పోలీసులను సైతం విస్మయానికి గురిచేసింది. పగటిపూట నిఘా ఉంటుందన్న భయంతో, రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మాత్రమే తన క్లినిక్ తలుపులు తెరిచి ఉంచేవాడు. అత్యవసర చికిత్సల పేరిట రాత్రి పూట వచ్చే రోగులనే తన లక్ష్యంగా చేసుకున్నాడు. ఎటువంటి వైద్య పట్టా లేకపోయినా, అనుభవజ్ఞుడైన డాక్టర్‌లా చలామణి అవుతూ దంతాల క్లీనింగ్ నుంచి రూట్ కెనాల్ వరకు అన్ని రకాల చికిత్సలు చేసేవాడని విచారణలో తేలింది. ఇరవై ఏళ్లుగా నేరేడ్‌మెట్ పరిసరాల్లోని వేలమంది బాధితులు ఇతని వద్ద చికిత్స పొంది ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

**సందేహమే సత్యాన్ని వెలికితీసింది**

రమేష్ నడుపుతున్న క్లినిక్ సమయాలు, అతని ప్రవర్తనపై స్థానికులకు అనుమానం కలగడంతో ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు మంగళవారం క్లినిక్‌పై మెరుపు దాడి నిర్వహించారు. పోలీసులు తనిఖీలు చేస్తున్న సమయంలో రమేష్ పొంతన లేని సమాధానాలు చెప్పడం, కనీస వైద్య పరిభాష తెలియకపోవడంతో అధికారులకు అనుమానం బలపడింది. తీరా లోతుగా ఆరా తీయగా, అతను పదో తరగతి కూడా పాస్ కాలేదని, కేవలం యూపీ నుంచి హైదరాబాద్ వచ్చి ఇక్కడ డాక్టర్ బోర్డు తగిలించుకున్నాడని తేలడంతో పోలీసులు అవాక్కయ్యారు.

**ప్రజల ఆరోగ్యానికి ముప్పు..పోలీసుల హెచ్చరిక**

అరెస్టయిన రమేష్‌ను మల్కాజ్‌గిరి పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశారు. అతని వద్ద ఉన్న నకిలీ సర్టిఫికెట్లు, వైద్య పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇరవై ఏళ్లుగా సాగిన ఈ దందా వెనుక ఇంకా ఎవరి ప్రమేయం ఉందనే కోణంలో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. తక్కువ ఖర్చుతో వైద్యం అందుతుందని నమ్మి ఇలాంటి నకిలీల బారిన పడవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. గుర్తింపు పొందిన ఆసుపత్రులు, అర్హత కలిగిన డాక్టర్ల వద్దే చికిత్స పొందాలని, ఎవరిపైనైనా అనుమానం కలిగితే తక్షణమే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## పసిప్రాణాన్ని బలిగొన్న కన్నతండ్రి పంతం!

(మొదటిపేజీ తరువాయి)

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మగూడెంలో జరిగిన ఈ హృదయ విదారక ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరికుప్పల రవికి మూడేళ్ల క్రితం స్వాతితో వివాహమైంది. వీరికి మేఘన (2), తొమ్మిది నెలల మయూరి అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే, కొంతకాలంగా దంపతుల మధ్య తలెత్తిన కుటుంబ కలహాల కారణంగా స్వాతి తన చిన్న కుమార్తె మయూరితో కలిసి పుట్టింట్లో ఉంటోంది. పెద్ద కుమార్తె మేఘన మాత్రం తండ్రి రవి వద్దే ఉంటోంది.

***పోలీసుల జోక్యం.. రవిలో రేగిన కక్ష***

పెద్ద కుమార్తె మేఘనను కూడా తన వద్దకు పంపించాలని స్వాతి తన పెద్దల ద్వారా కోరినప్పటికీ రవి ససేమిరా అన్నాడు. దీంతో స్వాతి ఇటీవల మాడ్గులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అక్కడ పోలీసులు నారాయణపురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, వారు రవిని పిలిపించి మాట్లాడారు. పెద్దమనుషుల సమక్షంలో సోమవారం నాడు పంచాయితీ నిర్వహించి సమస్యను పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు. అయితే, తన కుమార్తెను ఎక్కడ భార్య వద్దకు పంపాల్సి వస్తుందోనని కక్ష పెంచుకున్న రవి, ఎలాగైనా పసిబిడ్డను కడతేర్చాలని నిర్ణయించుకున్నాడు. శనివారం నాడు సపోటా పండులో ఎలుకల మందు కలిపి కన్నకూతురికి తినిపించాడు. అది తిన్న కొద్దిసేపటికే చిన్నారి మేఘన వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది.

**నిలోఫర్‌లో చికిత్స పొందుతూ చిన్నారి నిష్క్రమణ**

బిడ్డ ప్రాణం తీసిన అనంతరం రవి కూడా నిద్రమాత్రలు, ఎలుకల మందు కలిపిన నీటిని తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన రవిని నల్గొండ ఆసుపత్రికి, చిన్నారి మేఘనను దిల్లీలోని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ మృత్యువుతో పోరాడిన చిన్నారి మేఘన, మంగళవారం నాడు చికిత్స పొందుతూ కన్నుమూసింది. పసిమొగ్గలా వికసించాల్సిన చిన్నారి, తండ్రి కసాయి తనానికి బలైపోవడం స్థానికులను కలచివేసింది. స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవి నుంచి వాంగ్మూలం తీసుకున్న పోలీసులు, ఈ దారుణానికి గల పూర్తి కారణాలను విశ్లేషిస్తున్నారు.

## రైతులకు వ్యవసాయ సాంకేతికతపై అవగాహన

**కిసాన్ మేళా - కెవికే బెల్లంపల్లిలో రైతుల భారీ హాజరు**




**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి లోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కిసాన్ మేళా కార్యక్రమానికి రైతులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. సుమారు 500 మంది రైతులు పాల్గొని వివిధ వ్యవసాయ సాంకేతిక అంశాలపై అవగాహన పొందారు. కార్యక్రమానికి పీజేటీయూ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డా.ఎం. యాకాద్రి ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు కీలక సూచనలు అందించారు. ఉత్తర తెలంగాణ జోన్ ఏడిఆర్ డా. హరీష్ కుమార్ శర్మ, కెవికే బెల్లంపల్లి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. ప్రసూన , మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ ముఖ్య అతిథులుగా వేదికపై పాల్గొన్నారు. ప్రధాన శాస్త్రవేత్తలురామ్ గోపాల్ వర్మ,శ్రీధర్ చౌహాన్,వీరన్న, శాస్త్రవేత్త డా. బి. శ్రీనివాస్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.కిసాన్ మేళా సందర్భంగా ప్రైవేట్ కంపెనీలు ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేయగా, రైతులు వాటిని పరిశీలించి సాంకేతికసమాచారం పొందారు.ముఖ్య అతిథి డా. యాకద్రి హెచ్ డి పిఎస్ పత్తి సాగు, పచ్చి ఎరువుల వినియోగం,అంశాలపై ముఖ్య సూచనలు చేశారు. ప్రధాన శాస్త్రవేత్తలు హెచ్ డి పి ఎస్ పత్తి సాగు విధానాలు, సమగ్ర కీటక నియంత్రణ( ఐపిఎం) పద్ధతులు, యాసంగి వరిలో చలిని ఎదుర్కొనే నిర్వహణవిధానాలు, అనువైన వరి రకాలు గురించి వివరించారు.ఏడి ఆర్ డా.హరీష్ కుమార్ శర్మ యాసంగి సీజన్‌కు అనుకూలమైన శనగ, నువ్వులు వంటి పంటలపై వివరించగా, శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ ప్రత్యామ్నాయ పంటలైన శనగ, నువ్వులు,ఆవాలు సాగుపై సూచనలు ఇచ్చారు. రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కంపెనీలు,ఎన్జీవోలు,అతిథులు, ఎడిఎ బెల్లంపల్లి రాజనరేందర్ , వ్యవసాయ అధికారి బెల్లంపల్లి ప్రేమ్ కుమార్,భారత్ అగ్రి కన్సల్టెన్సీ సీఈవో వెంకటేష్, ఆర్ ఎ డబ్ల్యూ ఈ విద్యార్థులు, బాలాజీ కెర్మేరి ,రగోత్థం రెడ్డి , శంకర్, రఘు పటేల్ మరియు ఇతర ప్రగతిశీల రైతులు పాల్గొన్నారు.కార్యక్రమం ముగింపు సందర్భంగా ప్రగతిశీల రైతులను, ముఖ్య అతిథులను మరియు శాస్త్రవేత్తలను ఘనంగా సన్మానించారు.

## పట్టణాభివృద్ధే లక్ష్యం-మున్సిపల్ చైర్ పర్సన్



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణాభివృద్దే తన లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బ్లేడ్ ట్రాక్టర్ ను ఆమె ప్రారంభించారు. మున్సిపల్ పాలనాపరమైన అవసరాలకోసం కొనుగోలు చేసినట్టు తెలిపారు. అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తో కలిసి మంత్రులకు నిధుల కోసం విన్నవించినట్టు తెలిపారు. విడతల వారీగా నిధులు వస్తాయన్నారు. మొత్తం 49 వార్డులు పర్యటించి అవసరమున్న చోట మౌళిక సదుపాయాలు కల్పిస్తామన్నారు అన్ని వార్డులు అభివృద్ధి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రాజు, వైస్ చైర్మన్ మహ్మద్ రోహిత్ ,ఎఈ అరుణ్ ,కౌన్సిలర్లు ఇజ్జగిరి సంజయ్ , మంగేష్ , యోగేష్ ,మహబూబ్, అర్బాజ్, జీషాన్, విజయ్,బబ్లూ,పర్వేజ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**మందమర్రి, మహా :** మందమర్రి కాంగ్రెస్ పట్టణం అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో వివిధ ప్రాంతాల ప్రజలు రోగాల బారిన పడి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో చికిత్స పొంది ప్రభుత్వ సహాయ నిధికి దరఖాస్తులు చేసుకున్న పలువురికి చెక్కులు పంపిణీ చేసినట్లు ఉపేందర్ గౌడ్ వెల్లడించారు. చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ల ఆదేశాల మేరకు చెక్కులు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శులు పుల్లూరి లక్ష్మణ్, ఆకారం రమేష్, సీనియర్ నాయకులు సొత్కు సుదర్శన్, ఎండి జమీల్, మంద తిరుమల్, నెరవేట్ల శ్రీనివాస్, రాకం సంతోష్, సట్ల సంతోష్, ఎర్ర రాజు, మాయ తిరుపతి, సుకూర్, జావిద్ ఖాన్, గజ్జెల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.



## రహదారుల విస్తరణలో భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో జాతీయ రహదారుల విస్తరణలో భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల ఆర్.డి.ఓ.,జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన 63, 163 జి రహదారుల ఏర్పాటులో భాగంగా జిల్లాలోని ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులపై ప్రత్యేక దృష్టి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**



**బెల్లంపల్లి, మహా:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లాఅదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లాలోని తాండూర్ మండలకేంద్రంలోని కిష్టంపేట గ్రామపంచాయతీ పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలు భాగంగా కొనసాగుతున్న పారిశుధ్యం ,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామంలోని అంతర్గత రహదారులు,మురుగు కాలువవ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 10రోజులకు ఒకసారి శుభ్రపరచాలని, మిషన్ భగీరథ ద్వారా శుద్ధమైన త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లపథకాల అమలు తీరును పరిశీలించి లబ్ధిదారులు నిబంధనల ప్రకారం ఇండ్లు త్వరగా నిర్మించుకునేలా అధికారులు పర్యవేక్షించాలని,ఇసుక కొరతలేకుండా ఇందిరమ్మ ఇండ్లనిర్మాణానికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలోని నర్సరీని సందర్శించి వేసవిలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, సకాలంలో నీటిని అందించి మొక్కలను పరిరక్షించాలని తెలిపారు. వీధి దీపాలు పగలు వెలగకుండా అధికారులు పర్యవేక్షించాలని, విద్యుత్తును దుర్వినియోగం చేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ జ్యోత్స్న, డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్,మండల పంచాయతీ అధికారి అనిల్ కుమార్,పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ప్రైవేటికరణకు వ్యతిరేకంగా పోరాడుదాం

**మంచిర్యాల ఆర్టీసీ డిపో ఎదుట సీఐటీయు ఆందోళన**




**మంచిర్యాల, మహా :** ఆర్టీసీ ప్రైవేటికరణకు వ్యతిరేకంగా పోరాడుదామని డిమాండ్ చేస్తూ మంగళవారం మంచిర్యాల ఆర్టీసీ డిపో ఎదుట సీఐటీయు ఆందోళన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ విధ్యుత్ బస్సు లను ఆర్టీసీ సంస్థకే ఇవ్వాలని అన్నారు. చాలా రోజులుగా పెండింగ్ లో ఉన్న ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసి బస్లలో మహిళల ఉచిత ప్రయాణానికి అనుమతి ఇచ్చిందని తెలిపారు. పెరిగిన ప్రజల అవసరాల మేరకు ఆర్టీసి బస్సులు కూడా పెంచాలని వెల్లడించారు. ఈ క్రమంలో కార్మికుల సంఖ్యను పెంచాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎం.వి.యాక్ట్ 2019, విద్యుత్ బస్సుల విధానం వల్ల ఆర్టీసి సంస్థ తీవ్ర పరిస్థితులను ఎదుర్కొంటుందని చెప్పారు. విద్యుత్ బస్ వల్ల ఆర్టీసిలు కనుమరుగై, ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలు మాత్రమే ఆర్టీసి సంస్థలో మిగిలి ఉండే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ సంస్థలకు ఇస్తున్న అన్ని సబ్సిడీలను ఆర్టీసికి ఇవ్వాలని అన్నారు. ఆర్టీసీ సంస్థనే విద్యుత్ బస్సులను కొనుగోలు చేసే అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇందుకు అనుకూలంగా బడ్జెట్ లో నిధులు కేటాయించాలని ఆయన కోరారు. విద్యుత్ బస్ బాడీ ఫ్యాబ్రికేషన్ ఆర్టీసి వర్క్ షాప్ లలో చేయించాలని అన్నారు. అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆర్టీసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు .ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి దాసరి రాజేశ్వరి,చల్లూరి దేవదాస్, జిల్లా కమిటీ సభ్యులు గోమాస ప్రకాష్, రబియా, కుమారస్వామి, సంతోష్, సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సమితి సింగారంలో.. శ్రీరామనవమి వేడుకలకు శ్రీకారం..

**సీతారాముల కల్యాణ మహోత్సవాలు ప్రారంభం..**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని సమితి సింగారంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలోని శ్రీ కోదండ రామాలయం, కనకదుర్గా దేవిల ఆలయ ప్రాంగణంలో మంగళవారం సీతారాముల కల్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించిన తోరణపాకు, ముత్తైదువుల చేత పసుపు కొట్టు కార్యక్రమాలు ఆలయ పరిసరాలను ఆధ్యాత్మిక వాతావరణంతో నింపాయి. భారతీయ సంస్కృతిలో శ్రీరామనవమి పర్వదినం ధర్మానికి, నీతికి, సత్యానికి ప్రతీకగా నిలిచిన శ్రీరాముని జన్మదినంగా విశేష ప్రాధాన్యత కలిగి ఉంది. నవమి రోజున సీతారాముల కల్యాణాన్ని దర్శించడం ద్వారా కుటుంబ సౌఖ్యం, ఐశ్వర్యం కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. ఈ నేపథ్యంలో ఆలయంలో నిర్వహిస్తున్న మహోత్సవాలు గ్రామ ప్రజల్లో భక్తి, ఐక్యతను మరింత పెంపొందిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఆలయ అధ్యక్షులు మంగి వీరయ్య, ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి చంద్రమౌళి, కోశాధికారి మాదాడి రాజేష్, పెద్దలు నాగళ్ళ వెంకటేశ్వర్లు, సంగి ఆదమ్, పొట్నూరి రామారావు, మంగి మల్లికార్జున్, నాగళ్ళ సతీష్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహోత్సవాల సందర్భంగా ఆలయాన్ని పూలతో అలంకరించి, నిత్యపూజలు, ప్రత్యేక హోమాలు, భజనలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. జరిగబోయే సీతారాముల కల్యాణ మహోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చి దర్శించుకోవాలని వారు కోరారు.

# క్షయ వ్యాధిని త్వరగా గుర్తిస్తే నయం చేయవచ్చు

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** క్షయ వ్యాధిని త్వరగా గుర్తిస్తే నయం చేయవచ్చని మంచిర్యా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం టి. బి. ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మందమర్రి మండలం అందుగులపేట గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించినట్లయితే నయం చేయవచ్చని అన్నారు. 100 రోజుల పాటు క్షయ వ్యాధి నియంత్రణలో చర్యలు చేపట్టినట్లు వివరించారు. తెమడ పరీక్ష, ఎక్స్ రే తీసుకోవడం ద్వారా క్షయ వ్యాధిని గుర్తించవచ్చని చెప్పారు. సరైన సమయంలో చికిత్స అందించినట్లయితే పూర్తిగా రోగాన్ని నయం చేయొచ్చని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీల పరిధిలో పరీక్షలు, చికిత్స, అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. క్షయ ప్రభావిత ప్రాంతాలలో 14 సంవత్సరాల పైబడిన వారందరికీ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, పోషకాహార లోపం, క్యాన్సర్ వంటి అసంక్రమణ వ్యాధులను గుర్తించడం ద్వారా క్షయ వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స చేయవచ్చని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ సకాలంలో పౌష్టిక




ఆహారం తీసుకోవడం ద్వారా శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. ప్రజల సౌకర్యార్థం జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖాన, పల్లె దవాఖాన, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాల ద్వారా ఉచితంగా సేవలు అందిస్తున్నామని వివరించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు కీలు ఫౌండేషన్ ద్వారా డాక్టర్ రాజ్ కిరణ్ సంస్థ ద్వారా న్యూట్రిషన్ కిట్లను అందిస్తున్నట్లు చెప్పారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నిశ్చయ భూషణ్ యోజన క్రింద ప్రతి నెల 1 వేయి రూపాయలు పోషణ మధ్యము చికిత్స కాలం వరకు అందిస్తున్నామని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గిన, తుమ్మిన క్షయ క్రిములు బయటకు వస్తాయని, మాస్క్ ధరించినట్లయితే నియంత్రించవచ్చని, సాధ్యమైనంత వరకు గాలి, వెలుతురు ఉన్న ప్రాంతాలలో ఉండాలని తెలిపారు.

**జిల్లాలో 759 మంది క్షయ వ్యాధిగ్రస్తులు**

మంచిర్యాల జిల్లాలో 759 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించామని చెప్పారు.వీరికి పోషకాహారం కోసం డి బి టి ద్వారా 150 మంది రోగులకు 6 వేల రూపాయల చొప్పున పోషకాహారం కోసం అందిస్తున్నామని పేర్కొన్నారు.క్షయ వ్యాధి రహిత జిల్లాగా మంచిర్యాలను తీర్చిదిద్దుదామని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

**పొన్నారంలో ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక**

మందమర్రి మండలం పొన్నారం గ్రామంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్ తో కలిసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులకు సరైన అవగాహన కల్పించి నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకునేలా వివరించాలని, పనులు త్వరగా పూర్తి చేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించాలని తెలిపారు. గ్రామంలో నర్సరీని సందర్శించి వేసవి అయినందున సకాలంలో నీటిని అందించి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సతీష్ కుమార్, వైద్యాధికారులు డాక్టర్ అరుణశ్రీ, డాక్టర్ రమేష్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సి పి ఓ లు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముఫ్త్ బిజిలి యోజన ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




**మంచిర్యాల, మహా :** ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా దేశవ్యాప్తంగా 1 కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చే విద్యుత్ బిల్లులను తగ్గించడమే లక్ష్యంగా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన ప్రచార వాహనాన్ని రెడ్ కో ఆదిలాబాద్ డి.ఎం. ఎల్. శ్రీనివాస్, టి జి ఎన్ పి డి సి ఎల్ ఎస్.ఈ. రాజన్న ఇతర అధికారులతో కలిసి ప్రారంభించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇంట్లో రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ను ఏర్పాటు చేసుకుని ప్రతి నెల 360 యూనిట్ల వరకు విద్యుత్ పొందవచ్చని ఆయన వెల్లడించారు. దేశవ్యాప్తంగా 1 కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా పథకం రూపొందించినట్లు తెలిపారు. 1 కిలో వాట్ కు 30 వేల రూపాయలు, 2 కిలోవాట్లకు 60 వేల రూపాయల రాయితీ కాగా 18 వేల రూపాయల వరకు ప్రతి కిలోవాట్ కు, జి.హెచ్.ఎస్./ఆర్.డబ్ల్యూ.ఎ. (సాధారణ సౌకర్యాలు, ఈ.వి. చార్జింగ్) కోసం 500 కిలోవాట్ల వరకు రాయితీ అందుబాటులో ఉంటుందని, 3 కిలోవాట్లు అంతకంటే ఎక్కువ విద్యుత్తుకు 78 వేల రూపాయలు కాగా రాయితీ మొత్తం నేరుగా వినియోగదారుల బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. సోలార్ ద్వారా నెలవారి వినియోగం, విద్యుత్ బిల్లులు, కాలుష్యం తగ్గించుకోవచ్చని, మిగులు విద్యుత్ ను గ్రిడ్ కు సరఫరా చేస్తే నెట్ మీటరింగ్ ద్వారా డిస్కం నుంచి అదనపు ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. గృహ విద్యుత్ కనెక్షన్ ఉన్న వినియోగదారులు, సోలార్ కు అనుకూలమైన సొంత రూఫ్ టాప్ కలిగి గతంలో సోలార్ రాయితీ పొంది ఉండకూడదని తెలిపారు. జాతీయ పోర్టల్ ద్వారా www.pmsuryaghar.gov.in లో, అధికృత వెండర్ల ఎంపిక, దరఖాస్తు ట్రాకింగ్ చేసుకోవచ్చని, 3 కిలోవాట్ల వరకు సోలార్ వ్యవస్థకు షూరిటీ అవసరంలేని వడ్డీ రుణ సదుపాయం కల్పించబడుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డి.ఈ. మంచిర్యాల డి.మల్లేశం, ఎ డి ఈ కమర్షియల్ జి. మోహన్ రెడ్డి, ఎ డి ఈ మంచిర్యాల రూరల్ రాజశేఖర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గుజరాత్‌లో ఉమ్మడి పౌరస్మృతి బిల్లు

భారత రాజ్యాంగ నిర్మాతలు కలలుగన్న సామాజిక సమానత్వ దిశగా గుజరాత్ రాష్ట్రం మంగళవారం ఒక చారిత్రక అడుగు వేసింది. దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'గుజరాత్ ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) బిల్లు2026'ను ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టారు. మతం, కులం, వర్గాలతో సంబంధం లేకుండా పౌరులందరికీ వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత వంటి అంశాల్లో ఏకీకృత చట్టాలను వర్తింపజేయడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యం. ఉత్తరాఖండ్ తర్వాత ఈ విప్లవాత్మక చట్టాన్ని తీసుకువస్తున్న రెండో ప్రధాన రాష్ట్రంగా గుజరాత్ నిలవడంతో, ఈ పరిణామం జాతీయ స్థాయిలో సరికొత్త చర్చకు దారితీసింది.

మంగళవారం సభ ప్రారంభం కాగానే ముఖ్యమంత్రి ఈ బిల్లును ప్రవేశపెట్టడం, అధికార పక్ష సభ్యుల హర్షధ్వానాల మధ్య సభలో ఒక ఉద్వేగభరిత వాతావరణం నెలకొంది. ఈ బిల్లు రూపకల్పన వెనుక ప్రభుత్వం రెండేళ్ల పాటు అత్యంత లోతైన కసరత్తు నిర్వహించింది. 2022 అక్టోబర్‌లో రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ ఆర్.పి. ధొలారియా నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ, క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజాభిప్రాయాలను సేకరించింది. ఈ ప్రక్రియలో భాగంగా సుమారు 1.9 లక్షల మంది పౌరులు తమ లిఖితపూర్వక సూచనలను అందజేశారు. వివిధ మత పెద్దలు, న్యాయ నిపుణులు, సామాజికవేత్తల నుంచి సేకరించిన అభిప్రాయాలను క్రోడీకరించి, రాజ్యాంగంలోని 44వ అధికరణం స్ఫూర్తితో ఈ సమగ్ర ముసాయిదాను సిద్ధం చేశారు. కేవలం రాజకీయ నిర్ణయంగా కాకుండా, సామాజిక సంస్కరణగా దీనిని పరిగణించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సభను కోరారు.

బిల్లులోని ప్రధానాంశాలు మహిళా హక్కుల పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నాయి. ఇప్పటివరకు వివిధ వ్యక్తిగత చట్టాల కారణంగా మహిళలు ఎదుర్కొంటున్న వివక్షకు ఈ చట్టం ద్వారా చరమగీతం పాడనున్నారు. ముఖ్యంగా బహుభార్యాత్వాన్ని పూర్తిగా నిషేధించడంతో పాటు, వారసత్వ ఆస్తిలో కుమారులతో సమానంగా కుమార్తెలకు కూడా వాటా కల్పించేలా నిబంధనలను పొందుపరిచారు. ముస్లిం మహిళలకు సైతం విడాకుల తర్వాత భరణం పొందే ప్రక్రియను సులభతరం చేస్తూ ఈ బిల్లులో హామీ ఇచ్చారు. వివాహాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయడంతో పాటు, చిన్న వయసులో వివాహాలు జరగకుండా కఠినమైన నిబంధనలను అమలులోకి తీసుకురానున్నారు.

మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, మారుతున్న ఆధునిక సామాజిక సంబంధాలకు అనుగుణంగా లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లపై (సహజీవనం) ప్రభుత్వం కఠిన నిబంధనలను ప్రతిపాదించింది. సహజీవనం చేసే జంటలు జిల్లా అధికారుల వద్ద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, అలా చేయని పక్షంలో జరిమానాతో పాటు శిక్షార్హమైన చర్యలు ఉంటాయని బిల్లులో పేర్కొన్నారు. ఇది మహిళలకు భవిష్యత్తులో సామాజిక రక్షణ కల్పించడమే కాకుండా, అక్రమ సంబంధాల వల్ల కలిగే వివాదాలను అరికడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే దత్తత తీసుకునే ప్రక్రియలో కూడా అన్ని మతాల వారికి సమానమైన హక్కులను, బాధ్యతలను కల్పించడం ద్వారా సామాజిక న్యాయాన్ని చేకూర్చాలని నిర్ణయించారు.

గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా ఉన్న ఇతర రాష్ట్రాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఒకే దేశం ఒకే చట్టం అనే నినాదంతో ముందుకు వెళ్తున్న తరుణంలో, ఈ బిల్లు ఆమోదం పొందితే గుజరాత్ అభివృద్ధి నమూనాలో ఇదొక మైలురాయిగా నిలిచిపోనుంది. ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలను తోసిపుచ్చుతూ, ఇది ఏ మతానికీ వ్యతిరేకం కాదని, కేవలం పౌరులందరినీ సమానంగా చూడాలన్న రాజ్యాంగ స్ఫూర్తి అని ప్రభుత్వం గట్టిగా సమర్థించుకుంటోంది. సభలో సుదీర్ఘ చర్చ అనంతరం ఈ బిల్లు ఆమోదం పొంది చట్టంగా మారితే, 2026 సంవత్సరం గుజరాత్ సామాజిక చరిత్రలో ఒక నూతన అధ్యాయంగా మిగిలిపోనుంది.



# తమిళనాడులో ఉచితాల రాజకీయం

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు అత్యంత ఆసక్తికరంగా మారుతున్నాయి. అధికార డీఎంకేను గద్దె దించడమే లక్ష్యంగా అన్నాడీఎంకే తన అమ్ముల పొదిలోని అత్యంత శక్తివంతమైన ఉచితాల అస్త్రాన్ని బయటకు తీసింది. మంగళవారం చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో మిక్సీలు, గ్రైండర్లు, ఫ్యాన్ల పంపిణీతో చరిత్ర సృష్టించిన అన్నాడీఎంకే, ఈసారి ఏకంగా ఇంటింటికీ రిఫ్రిజిరేటర్లను అందిస్తామని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచింది. రైస్ రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా ఒక రిఫ్రిజిరేటర్‌ను పంపిణీ చేస్తామన్న హామీ ఓటర్లను, ముఖ్యంగా సామాన్య గృహిణులను ఆకట్టుకునేలా రూపొందించినట్లు స్పష్టమవుతోంది.

ఉచితాల విషయంలో అన్నాడీఎంకే కేవలం వస్తువులకే పరిమితం కాలేదు. ప్రస్తుతం తమిళనాడులో మహిళలకు అమలవుతున్న ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని పురుషులకు కూడా వర్తింపజేస్తామని ప్రకటించి సరికొత్త చర్చకు తెరలేపింది. పురుషుల ఓటు బ్యాంకును గంపగుత్తగా కొల్లగొట్టే లక్ష్యంతో, లింగ వివక్షకు తావులేకుండా అందరికీ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తామని పళనిస్వామి స్పష్టం చేశారు. డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను తాము అధికారంలోకి వస్తే మరింత పటిష్టంగా అమలు చేయడంతో పాటు, అదనపు ప్రయోజనాలను చేకూరుస్తామన్న సంకేతాన్ని పార్టీ పంపింది. ఈ నిర్ణయం శ్రమజీవులు, దినసరి కూలీలకు పెద్ద ఊరటనిచ్చే అంశమని విశ్లేషకులు భావిస్తున్నారు.

మరోవైపు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సతమతమవుతున్న పేదలకు అన్నాడీఎంకే భారీ భరోసా ఇచ్చింది. రైస్ కేటగిరీ రేషన్ కార్డులు ఉన్నవారికి ప్రతి నెలా ఉచితంగా అందే బియ్యంతో పాటు అదనంగా ఒక కిలో పప్పు మరియు ఒక లీటర్ వంటనూనెను కూడా పూర్తి ఉచితంగా పంపిణీ చేస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారు. పేదల వంటగదిపై భారాన్ని తగ్గించడమే తమ లక్ష్యమని, జయలలిత హయాంలో ఉన్న సంక్షేమ పాలనను మళ్లీ తీసుకువస్తామని పళనిస్వామి ధీమా వ్యక్తం చేశారు. కేవలం బియ్యంతో సరిపెట్టకుండా, పౌష్టికాహార భద్రతను కూడా కల్పిస్తామన్న హామీ ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది.

ఈ మేనిఫెస్టో విడుదల సందర్భంగా పళనిస్వామి మాట్లాడుతూ, డీఎంకే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు, అన్నాడీఎంకే దూరదృష్టిని ప్రజల ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఉచితాల వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై భారం పడుతుందన్న విమర్శలను కొట్టిపారేస్తూ, సంక్షేమమే తమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఘనవిజయం సాధిస్తుందని, తాము ప్రకటించిన ప్రతి హామీని అక్షరాలా అమలు చేసి చూపిస్తామని ఆయన ప్రకటించారు. చెన్నై హెడ్ క్వార్టర్స్ వద్ద అన్నాడీఎంకే శ్రేణులు ఈ మేనిఫెస్టోను బాణసంచా కాల్చి సంబరాలతో ఆహ్వానించారు. తమిళనాడులో ఎన్నికల వేడి తారస్థాయికి చేరిన వేళ, అన్నాడీఎంకే కురిపించిన ఈ హామీల జల్లు ఏ మేరకు ఓట్లుగా మారుతుందో వేచి చూడాలి.

EDITORIAL సంపాదకీయం

# లోకనాయకుడి తెలివైన నిర్ణయం



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరం ముంచుకొస్తున్న వేళ లోకనాయకుడు కమల్ హాసన్ తెలివైన నిర్ణయం తీసుకున్నారు. గత కొంతకాలంగా స్వతంత్ర అస్తిత్వం కోసం పోరాడుతున్న 'మక్కల్ నీది మయ్యం' పార్టీ, ఈసారి ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచింది. మంగళవారం చెన్నైలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ అధికార డీఎంకే పార్టీకి తాము పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు ఎవరూ పోటీ చేయరని, డీఎంకే నేతృత్వంలోని కూటమి అభ్యర్థుల గెలుపు కోసమే తమ శ్రేణులు పనిచేస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయం తమిళనాట అధికార పక్షానికి కొండంత అండగా మారగా, విపక్ష అన్నాడీఎంకే బీజేపీ కూటమికి గట్టి సవాల్‌గా పరిణమించింది. ఈ సందర్భంగా కమల్ హాసన్ తన నిర్ణయం వెనుక ఉన్న లోతైన అంతరార్థాన్ని వివరించారు. అయితే వాస్తవంగా గ్రౌండ్ లోని పరిస్థితి భిన్నంగా ఉండడం, పోటీచేసేందుకు అవసరమైన మెకానిజం లేకపోవడంతో కూటమికి అనవసరంగా నష్టం చేయడం ఎందుకని సైడ్ అయినట్లు తెలుస్తోంది. కూటముల కొట్లాటలో కమల్ ది తెలివైన నిర్ణయంగా భావించాల్సిందే. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, మతతత్వ శక్తులను అడ్డుకోవడమే లక్ష్యంగా తాము ఈ అడుగు వేసినట్లు కమల్ పేర్కొన్నారు. ఎటువంటి షరతులు లేకుండా, పదవుల మీద ఆశ లేకుండా ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ నాయకత్వానికి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇది కేవలం రాజకీయ పొత్తు మాత్రమే కాదని, తమిళనాడు సంస్కృతిని, స్వయంప్రతిపత్తిని కాపాడుకోవడానికి జరుగుతున్న పోరాటంలో భాగమని ఆయన వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన ఎంఎన్‌ఎం, ఈసారి పరోక్షంగా రంగంలోకి దిగడం ద్వారా తన ఓటు బ్యాంకును డీఎంకే వైపు మళ్లించే ప్రయత్నం చేస్తోంది. కమల్ హాసన్ తీసుకున్న ఈ నిర్ణయంతో తమిళనాడులో పోటీ ప్రధానంగా రెండు కూటముల మధ్యే కేంద్రీకృతం కానుంది. అన్నాడీఎంకే ఉచితాల వెల్లువతో ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తుండగా, కమల్ వంటి ప్రభావిత నాయకుడి మద్దతు డీఎంకేకు సామాజికంగా, రాజకీయంగా మరింత బలాన్ని చేకూర్చనుంది. ముఖ్యంగా పట్టణ ప్రాంత ఓటర్లపై ఎంఎన్‌ఎం ప్రభావం ఎక్కువగా ఉంటుంది కాబట్టి, ఆ ఓట్లు ఇప్పుడు గంపగుత్తగా స్టాలిన్ కూటమికి పడే అవకాశం ఉంది. కమల్ హాసన్ నిర్ణయం పట్ల డీఎంకే శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తుండగా, సొంత పార్టీ శ్రేణుల్లో మాత్రం కొంత మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. తమ పార్టీ పోటీ చేయకపోవడం వల్ల భవిష్యత్తు అస్తిత్వంపై కార్యకర్తలు ఆందోళన చెందుతున్నప్పటికీ, కమల్ మాత్రం తన నిర్ణయం సరైనదని సమర్థించుకుంటున్నారు. వచ్చే నెలాఖరులో జరగనున్న పోలింగ్‌కు ఇంకా సమయం ఉన్నప్పటికీ, కమల్ హాసన్ ప్రకటనతో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. లోకనాయకుడి మద్దతుతో డీఎంకే కూటమి మరిన్ని వ్యూహాలతో ముందుకు వెళ్లేందుకు సిద్ధమవుతోంది. అన్నాడీఎంకే ప్రకటించిన ఉచిత రిఫ్రిజిరేటర్లు, పురుషులకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను ఎదుర్కోవడానికి డీఎంకేకమల్ ద్వయం ఎలాంటి ఎదురుదాడి చేయబోతుందనేది ఇప్పుడు అత్యంత ఆసక్తికరంగా మారింది. ఏప్రిల్ 23న జరిగే ఈ మహా సంగ్రామంలో తమిళ ఓటరు ఎవరి వైపు మొగ్గు చూపుతాడో వేచి చూడాలి.


## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

ANN తెలుగు
మహా పత్రిక
05
బుధవారం, హైదరాబాద్ | 25-03-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM

# విద్యుత్ బస్సులు ఆర్టీసీకే కేటాయించాలి

**మణుగూరు డిపో ఎదుట కార్మికుల ధర్నా**




**మణుగూరు, మహా :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా మణుగూరు మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. మండల కమిటీ కన్వీనర్ కొడిశాల రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికులు విద్యుత్ బస్సులను ఆర్టీసీకే కేటాయించి, సంస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు రామారావు, సత్తుపల్లి సాంబశివరావులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేసి, ప్రైవేటు సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వడం మానుకోవాలన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న విధానాలను రద్దు చేసి, ఆర్టీసీకి సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రైవేటు సంస్థలకు ఇస్తున్న సబ్సిడీలను ఆర్టీసీకి ఇవ్వడంతో పాటు, బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి ఆర్టీసీ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు పిట్టల నాగమణి, రైతు సంఘం నాయకులు రాజు, కార్మిక సంఘం నాయకులు అంజి, బోర సత్యనారాయణ, చల్లా సాంబయ్య, విద్యార్థి సంఘం నాయకులు తేజ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ బస్సులను ఆర్టీసీయే కొనుగోలు చేయాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి డిమాండ్
- సిఐటియు ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ధర్నా



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** విద్యుత్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యమే కొనుగోలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఆధ్వర్యంలోనే బస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం కొత్తగూడెం ఆర్టీసీ డిపో ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ముందుగా సీఐటీయూ నాయకులు బస్టాండ్ ఎదురుగా ధర్న నిర్వహించి నినాదాలు చేయడం జరిగింది. ఎలక్ట్రిసిటీ బస్సులను ఆర్టీసీలోనే ఉంచాలని, ప్రైవేటీకరణను ఆపాలని ప్రజలకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి ప్రసంగిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ, సింగరేణి సంస్థలు రాష్ట్రానికి గుండెకాయ లాంటివి అని ఇలాంటి సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ దుర్మార్గమైన చర్యలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. ఆర్టీసీ కార్మికులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని మహాలక్ష్మి పథకం ద్వారా కార్మికులపై పడిన పని భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాలుష్య నివారణ పేరుతో విద్యుత్ బస్సులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం వలన డిపోలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. తక్షణం విద్యుత్ బస్సులు ప్రైవేట్ సంస్థలకు ఇచ్చే విధానాన్ని మానుకొని ఆర్టీసీకి ప్రభుత్వమే బస్సులు కొనుగోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులపై రోజురోజుకు పని భారం పెరుగుతుందన్నారు. ప్రయాణికులను అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన వారి స్థానంలో కొత్త రిక్రూట్మెంట్ జరగడంలేదని అన్నారు. కార్మికులకు రావలసిన 2017 సంవత్సరపు బకాయిలను వెంటనే చెల్లించాలని కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆర్టీసీ బస్సులను ప్రైవేట్ సంస్థకు ఇచ్చే విధానాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ భూక్య రమేష్, జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు, రైతు సంఘం నేత వంకుడోత్ కోబల్, సీఐటీయూ నాయకులు ఎస్ ఎస్ రాజు, నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమమే ఐఎన్టీయూసీ ధ్యేయం

**ఐఎన్టీయూసీ నాయకులు తీగల క్రాంతి కుమార్ , బి.కోటేశ్వరరావు**



**సత్తుపల్లి, మహా:** పట్టణ పరిధిలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐ.ఎన్.టి.యు.సి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సత్తుపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఐ.ఎన్.టి.యు.సి యూనియన్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఐ.ఎన్.టి.యు.సి జాయింట్ జనరల్ సెక్రెటరీ తీగల క్రాంతికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తీగల క్రాంతి కుమార్ మాట్లాడుతూ భూపాలపల్లిలో జరిగిన సమావేశంలో స్వయంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సింగరేణి కార్మికుల సమస్యలపై మెడికల్ బోర్డు నిలిపివేత అంశంపై స్పందించి సింగరేణి కార్మికుల మెడికల్ బోర్డు నిలిపి వేయలేదని తెలిపినప్పటికీ, సింగరేణి గుర్తింపు సంఘంగా గెలుపొందిన ఏ.ఐ.టీ.యూ.సీ యూనియన్ సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి మెడికల్ బోర్డు పునరుద్ధరణ చేయించలేని స్థితిలో వైఫల్యం చెందిందని అన్నారు. ఎన్నికల సమయంలో ఏ.ఐ.టి.యు.సి కార్మికులకు అనేక హామీలు ఇచ్చి వాటిని సాధిస్తామని మభ్యపెట్టి గుర్తింపు సంఘంగా గెలిచారని విమర్శించారు. గుర్తింపు సంఘంగా గెలిచిన నాటినుండి ఏ.ఐ.టి.యు.సి ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా కార్మికులను మభ్యపెడుతున్నారని విమర్శించారు. సింగరేణిలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఐ.ఎన్.టి.యు.సి సిద్ధంగా ఉందని తెలిపారు. సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం సమర్థవంతంగా కాపాడగల సామర్థ్యం ఐ.ఎన్.టి.యు.సి యూనియన్ కి మాత్రమే ఉన్నదని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, ఆదాయ పన్ను మాఫీ , కార్మికులకు సొంత ఇంటి పథకం, మెడికల్ బోర్డు పునరుద్ధరణ వంటి కీలక అంశాలను నిరంతరం తమ నాయకుడు ఐ.ఎన్.టి.యు.సి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారని తెలిపారు. ఐ.ఎన్.టి.యు.సి అధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, నూతన హక్కుల సాధన విషయంలో యూనియన్ అన్ని సమయాలలో కార్మికుల పక్షాన పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు నాగ ప్రకాష్, జే.వి.ఆర్ ఓ.సి ఫిట్ సెక్రటరీ సీతారామరాజు, కిష్టారం ఓ.సి ఫిట్ సెక్రటరీ బాలాజీ నాయకులు సురేష్, శ్రీధర్, కిరణ్, ఐ.వి.రెడ్డి , మురళీకృష్ణ, శ్రీనివాస్ రాము, తిరుమలరావు, రామచందర్, రమేష్, ఇక్బాల్, సుదర్శన్, రామారావు, శ్రీనివాస చారి, శ్రీనివాసరావు, అశోక్, సదానందం, సుదర్శన్, గణేష్, వెంకటేశ్వర్లు, షాట్రాక్ బాబు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## గ్యాస్ సబ్సిడీలను లబ్ధిదారుల

# అకౌంట్‌లో జమ చేయాలి

**మునిగడప పద్మ డిమాండ్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన గ్యాస్ సిలిండర్ హామీ సబ్సిడీని తక్షణమే విడుదల చేయాలని 16వ డివిజన్ కార్పొరేటర్, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా నాయకురాలు మునిగడప పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం 16వ డివిజన్లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు మూడు హామీలను ఇవ్వడం జరిగిందని అందులో కేవలం ఉచిత బస్సు పథకం మాత్రమే అమలవుతుందని మునిగడప పద్మ తెలిపారు. ప్రభుత్వం ఏర్పడ్డాక 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు పరస్తామన్న ప్రజా ప్రభుత్వం కేవలం గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించి రెండు మూడు నెలలు మాత్రమే లబ్ధిదారుల ఎకౌంట్లో 500 రూపాయల సబ్సిడీ వేసి చేతులు దులుపుకున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక పెన్షన్ల 4000, వికలాంగుల పెన్షన్లు 6000 పెంచుతామని మొదటి సంతకం పెట్టి నేటికీ అమలు కాకపోవడం వల్ల వృద్ధులు ,వికలాంగులు వితంతువులు ఒంటరి మహిళలు వారి కళ్ళకు కాయలు కాసేటట్లుగా ఎదురుచూస్తున్నారని అన్నారు. తక్షణమే మహిళలకు ఇచ్చిన మహాలక్ష్మి పథకంలోని గ్యాస్ సిలిండర్ సబ్సిడీ ప్రతి ఇంటి మహిళకు 2500 రూపాయలు మంజూరు చేయాలని ఆమె ప్రజా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మహిళలు నాయకురాలు బెల్లం బేబీ, రావిశెట్టి పద్మ, జయమ్మ, మాధవి, శాంతి, జమున, ఆసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలు ఆసుపత్రులు ఆదర్శ కేంద్రాలుగా నిలవాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే ఆదర్శ కేంద్రాలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం అన్నపురెడ్డిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా వైద్య సేవల అమలును సమగ్రంగా పరిశీలించారు. మొదటగా ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ మందుల గది ప్రయోగశాల (ల్యాబ్), ఇన్‌పేషెంట్ విభాగం స్టాక్ రిజిస్టర్ సిబ్బంది హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. అవుట్ పేషెంట్ రిజిస్టర్‌ను పరిశీలించి రోజువారీగా వచ్చే రోగుల సంఖ్యపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవుట్ పేషెంట్ వార్డులో ఉన్న ఒక బాలుడితో మాట్లాడి కుక్క కాటు టీకా కోసం వచ్చినట్లు తెలుసుకుని టీకాలు అందుబాటులో ఉన్నాయా అని విచారించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఏ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారో అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉందా అనే అంశాలపై ఆరా తీశారు. తనిఖీ సమయంలో మెడికల్ అధికారి అందుబాటులో లేకపోవడంతో కారణాలను ప్రశ్నించగా క్షేత్రస్థాయిలో పర్యటనలో ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. వెంటనే మెడికల్ అధికారిని పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొంతమంది సిబ్బంది యూనిఫాం ధరించకపోవడాన్ని గమనించి విధి సమయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. సిబ్బంది డిప్యూటేషన్‌పై అధిక సంఖ్యలో విధులు నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తించి దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని ఆదేశించారు.

అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. పదవ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలిస్తూ ఇటీవల జరిగిన ఇంగ్లీష్ పరీక్షపై విద్యార్థులను అడిగి తెలుసుకుని రాబోయే గణిత పరీక్షకు క్రమబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. ఉపాధ్యాయులు ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించి సులభ పాఠాలను పునరావృతం చేయిస్తూ విద్యార్థులను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని తనిఖీ చేశారు. మెనూలో ఉన్న కొన్ని పదార్థాలు లేకపోవడంపై కారణాలు అడిగి తెలుసుకుని వడ్డించిన ఆహారాన్ని తిని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. వంటల్లో ఉప్పు అధికంగా ఉన్నట్లు గమనించి సరిపడ మోతాదులో మాత్రమే వినియోగించాలని సూచించారు. విద్యార్థులకు పోషకాహారం అందించాలంటే మెనూ ప్రకారం అన్ని పదార్థాలు తప్పనిసరిగా వండాలని స్పష్టం చేశారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు కూరగాయల నాణ్యతను తనిఖీ చేశారు. ఎండాకాలంలో కూరగాయలు త్వరగా పాడయ్యే అవకాశం ఉన్నందున తాజా నాణ్యమైన కూరగాయలను మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. మెనూలో ఉన్న బీట్‌రూట్, పాలకూర అందుబాటులో లేకపోవడంపై ప్రశ్నించారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు గురించి విచారించి ఆర్ ఓ ప్లాంట్ నుంచి వచ్చే వేస్ట్ వాటర్‌ను శుభ్రత పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో ట్యాపుల లీకేజీ గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలు ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే ముఖ్య కేంద్రాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం, పరిశుభ్ర వాతావరణం కల్పించడం అత్యవసరమని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు క్రమబద్ధంగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు వారికి సమగ్ర మార్గదర్శనం అందించాలని సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి రోగికి సమయానుకూలంగా వైద్య సేవలు ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని టీకాలు అత్యవసర మందులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను వేగంగా ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించేలా అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉండాలని రిఫరల్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ పాటిస్తూ యూనిఫాం నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని బాధ్యతాయుతంగా సేవలు అందించాలని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన విద్యా, వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని లోపాలు గుర్తించిన పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మెడికల్ అధికారి ప్రియాంక, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏడు మండలాల సమస్యలపై సీఎం రేవంత్, మంత్రి పొన్నములకు

# ఎమ్మెల్యే పాయం వినతి..





**మణుగూరు మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, మంత్రి పొన్నం ప్రభాకర్ లను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో నెలకొన్న పలు ప్రాధాన్య సమస్యలను వివరించిన ఎమ్మెల్యే, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. తాగునీరు, మౌలిక వసతులపై ఎమ్మెల్యే వివరిస్తూ.. నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. కాలువల వ్యవస్థ సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సిమెంట్ రహదారులు, వీధి దీపాల కొరతతో పాటు పాత రహదారుల మరమ్మతులు, కొత్త రహదారుల నిర్మాణం అత్యవసరమని వివరించారు. ముఖ్యంగా పోడు భూముల సమస్యలను పరిష్కరించి అర్హులైన రైతులకు హక్కులు కల్పించాలని కోరారు.

**ఆరోగ్యం, విద్య రంగాల బలోపేతం అవసరమనీ..**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు వైద్య సిబ్బంది, పరికరాల కొరతను తీర్చాలని ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, అదనపు తరగతి గదుల నిర్మాణం, అవసరమైన సదుపాయాల కల్పనతో పాటు అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. మణుగూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పాయం సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. సమస్యలపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని ఆమెని ఇచ్చినట్లు పాయం ఈ సందర్భంగా విలేకరులకు తెలిపారు.

**బీసీ బాలికల పాఠశాలకు రూ.29 కోట్లు..**

మణుగూరులో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి పాఠశాలకు శాశ్వత భవన నిర్మాణం కోసం రూ.29 కోట్ల నిధులు మంజూరు చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కోరారు. ఈ మేరకు మంత్రి పొన్నం కు ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం పాఠశాల ప్రైవేట్ భవనంలో నడుస్తోందని, స్థలం, మౌలిక వసతుల కొరతతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే వివరించారు. రామానుజవరం గ్రామంలో ఐదు ఎకరాల భూమిని గుర్తించి, పాఠశాల, కాలేజీ భవనాలు, వసతి గృహాలతో సమగ్ర క్యాంపస్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పాఠశాల విభాగంలో 291 మంది, జూనియర్ కాలేజీలో 120 మంది విద్యార్థినులు చదువుకుంటుండగా మొత్తం 411 మంది బాలికలకు తగిన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బోధనా, బోధనేతర సిబ్బందితో కలిపి మొత్తం 451 మందికి అనుకూల వసతులు అవసరమని పేర్కొన్నారు. వినతిపత్రంపై మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సానుకూలంగా స్పందిస్తూ, బీసీ బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిధుల మంజూరుపై సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం విలేకరులకు తెలిపారు.

## రైతు నేస్తం కార్యక్రమం..

# వ్యవసాయాభివృద్ధికి మార్గదర్శకం..

**జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు**



**మణుగూరు, మహా :** రైతుల సమస్యలకు పరిష్కార మార్గాలు చూపుతూ, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం వ్యవసాయ అభివృద్ధికి ఎంతో ఉపయోగకరమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు అన్నారు. మణుగూరు మండలం గుట్ట మల్లారం గ్రామపంచాయతీ పరిధిలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం రైతులకు సాంకేతిక సూచనలు అందించి, పంటల దిగుబడిని పెంచే విధానానికి కీలక వేదికగా నిలుస్తుందని ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కట్టుమల్లారం సర్పంచ్ జగడి ప్రసాద్, సమితి సింగారం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, సహాయ వ్యవసాయ సంచాలకులు తాతారావు, వ్యవసాయ అధికారులు రాహుల్ రెడ్డి, లక్ష్మణరావుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

**ఏఈఓ డాక్టర్ కొమరం లక్ష్మణరావుకు ఘన సన్మానం..**

మణుగూరు మండల వ్యవసాయ విస్తరణ అధికారి కొమరం లక్ష్మణరావుకు ఇటీవల డాక్టరేట్ ప్రధానోత్సవం జరిగిన సందర్భంగా మణుగూరు మండలం, గుట్ట మల్లారం గ్రామపంచాయతీ పరిధిలో గల రైతు వేదికలో డాక్టర్ కొమరం లక్ష్మణరావును శాలువాతో సన్మానించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో కట్టు మల్లారం, గుట్ట మల్లారం సర్పంచులు కారం పూజ, జగడి ప్రసాద్, సమితి సింగారం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, గుట్ట మల్లారం ఉపసర్పంచ్ మహేష్ లతో పాటు సహాయ వ్యవసాయ సంచాలకులు బీ తాతారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్రి చలపతిరావు, బొజ్జా త్రిమూర్తులు, ఎండి యాకూబ్ అలీ, తోటకూర గోపయ్య, కారం భద్రయ్య, ఎస్కే ఇస్మాయిల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక విద్యలోనే ఓనమాలు నేర్వాలి

- లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కమలా రాజశేఖర్
- జడ్ వీరభద్రపురం స్కూల్ కి లయన్స్ క్లబ్ బెంచీలు వితరణ




**మహా,దుమ్ముగూడెం:** విద్యార్థులకు ప్రాథమిక దశలోనే విద్య ఓనమాలు నేర్పించి ఉన్నతమైన ఎకరాలకు ఎదగాలని భద్రాచలం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కమలా రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన జెడ్ వీరభద్రపురం ప్రాథమిక పాఠశాలలో స్థానిక సర్పంచ్ కొమరం శాంతమ్మతో కలిసి బెంచిలను వితరణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పిల్లలు తల్లిదండ్రులను గురువలను పూజించాలని చదువులో రాణించి భవిష్యత్తులో స్థిరపడాలని సూచించారు. అనంతరం స్థానిక సర్పంచ్ లైన్స్ క్లబ్ సభ్యులు సన్మానించారు. పాఠశాలకు బెంచులు వితరణ చేసినందుకు సర్పంచ్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వంగవేణి ఉపాధ్యాయులు సుశీల లయన్స్ క్లబ్ సభ్యులు వనజ మోహన్ రావు సూర్యనారాయణ కుమారి గ్రామస్తులు చంటి గిరిబాబు చిట్టిబాబు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# బూర్గంపహాడ్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమం



**బూర్గంపహాడ్ మహా :** వెరిస్క్ అనలిటిక్స్ కంపెనీ, హైదరాబాద్ వారి ఆర్థిక సహకారంతో సమరిటన్స్ ఫర్ ద నేషన్ సంస్థ ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

**అదనపు తరగతి గది, వాష్‌రూమ్ నిర్మాణం**

ఈ కార్యక్రమం భాగంగా సుమారు రూ. 3,50,000 వ్యయంతో ఒక అదనపు తరగతి గది మరియు ఒక వాష్‌రూమ్ నిర్మించి విద్యార్థుల వినియోగానికి అందజేశారు. ఈ సదుపాయాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండనున్నాయి.

**ముఖ్య అతిథిగా రామ్ కుమార్**

ఈ కార్యక్రమానికి సంస్థ ఫౌండర్ రామ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన మరియు గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు.

**విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పాటు**

ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగుపరచడమే కాకుండా వారి భవిష్యత్తుకు దోహదపడతాయని రామ్ కుమార్ తెలిపారు.

# ఆరోగ్య సూత్రాలు పాటించాలి

- మేయర్ మూడు గణేష్
- రైటర్ బస్తీలో ఉచిత వైద్య శిబిరం సక్సెస్
- వైద్య సేవలను వినియోగించుకున్న ప్రజలు
- బీపీ షుగర్ థైరాయిడ్ పరీక్షలు
- ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఆహారపు అలవాట్లు మార్చుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ రైటర్ బస్తి గొల్లగూడెం ఏరియాలో మంగళవారం స్థానిక కార్పొరేటర్ జల్లి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మేయర్ మూడు గణేష్ ప్రారంభించి ప్రసంగించారు. మారుతున్న కాలానుగుణంగా మనం తినే ఆహారపు అలవాట్లు మార్చుకొని ఆరోగ్యంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉంటానే ఏ పనైనా సులువుగా చేసుకోగలుగుతామని స్పష్టం చేశారు. జిల్లా వైద్య శాఖ అధికారి తుకారం రాథోడ్ మాట్లాడుతూ ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు నివారణ చర్యలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. టీబీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టీబీ వ్యాధి నిర్ధారణకు సరైన చికిత్స ముఖ్యమైందన్నారు. ప్రతి ఏడాది మార్చి 24న అంతర్జాతీయ క్షయ వ్యాధి దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. క్షయవ్యాధి (టీబీ) గురించి ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ ప్రాణాంతక వ్యాధిని అంతం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని తెలిపారు. రెండు వారాలకు మించి ఆగకుండా దగ్గు రావడం బరువు తగ్గడం సాయంత్రం వేళ జ్వరం రావడం రాత్రిపూట చెమటలు పట్టడం వంటివి టీబీ ప్రధాన లక్షణాలు అన్నారు. వీటిని సాధారణ జలుబు లేదా దగ్గుగా పొరబడి అశ్రద్ధ చేస్తే వ్యాధి తీవ్రమవుతుందని, టీబీ పూర్తిగా మందులతో నయం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లలిత కుమారి, 28వ డివిజన్ కార్పొరేటర్ జల్లి శ్రీలక్ష్మి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, న్యాయవాది పలివెల సాంబశివరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా కాంగ్రెస్ పార్టీ, ఆశ్రమ పాఠశాల సిబ్బంది



**మహా,దుమ్ముగూడెం:** మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామంలో అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన కల్లూరి బుచ్చమ్మ, వెంకటమ్మ కుటుంబాలకు మంగువాయిబాడవ ఆశ్రమ పాఠశాల హెచ్ఎం సిబ్బందితో కలిసి కుటుంబాలను పరామర్శించి నిత్యవసర వస్తువులు ఒక్క కుటుంబానికి 3600 చొప్పున నగదును అందించారు. అనంతరం భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ బాధితులకు 50 కేజీల రైసు దుప్పట్లు నిత్యవసర వస్తువులు అందించారు. అనంతరం సీతమ్మ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రమాదంలో కాలిపోయిన పట్టాదారు పాస్ పుస్తకాలు సంబంధిత పత్రాలు అధికారులతో మాట్లాడి ఇప్పిస్తామని, స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం ప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి తీసుకువచ్చి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సత్యాలు సేవాదళ్ డివిజన్ అధ్యక్షులు వెంకటరమణారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పట్టా వెంకటేశ్వరరావు శ్రీకాంత్ నరేంద్ర వెంకటేష్ సర్పంచ్ సుబ్బారావు ఆశ్రమ పాఠశాల హెచ్ఎం వీరమ్మ ఉపాధ్యాయులు పార్వతి భాస్కర్ సత్యనారాయణ రమేష్ శ్రీనివాస్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం పర్ణశాల పుణ్యక్షేత్రాలలో గ్యాస్ కొరతను తీర్చాలి

వీరమాచినేని వినిల్

**మహా దుమ్ముగూడెం:** భద్రాచలం పర్ణశాల వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలు ప్రస్తుతం నెలకొన్న కమర్షియల్ గ్యాస్ కొరతపై దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరమాచినేని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న శ్రీరామనవమి ఏర్పాటల్లో భక్తులు వేల సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున భోజన సదుపాయాలు కల్పించే ఓటర్లు అన్నదాన సత్రాలకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ దొరకడం లేదని ప్రభుత్వం జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ యుద్ధాల వల్ల పుణ్యక్షేత్రాలు భక్తులు ఇబ్బందులు కలకూడదని ప్రభుత్వం వెంటనే స్పందించి గ్యాస్ సరపరను క్రమబద్ధీకరించాలని స్థానిక వ్యాపారులకు అండగా ఉండాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన అన్నారు.

## పర్ణశాల ఆలయంలో గర్కుమంతుడు ప్రాణ ప్రతిష్ట



**మహా, దుమ్ముగూడెం:** ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల ఆలయంలో సీతారాముల కల్యాణ గడియలు సమీపిస్తున్నవేళ ఆలయంలో గర్కుమంతుడు కి ఆలయ అర్చకులు ప్రాణ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా పటాది వాసం, గరుడ పూజ, తిరువీధి సేవగా నిర్వహించి పర్ణశాల గ్రామ శివారులో ఉన్న విశ్రాంతి మండపం వద్దకు వెళ్లి తిరిగి ఆలయానికి చేరుకొని ఆలయం వద్ద గల యాగశాలలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ బాధ్యులు వాసు, అర్చకులు ఎస్.కిరణ్ కుమార్ చార్యులు,పీ.భార్గవాచార్యులు,వెంకటాచార్యులు,భరద్వాచార్యులు,నరసింహ చార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎదగాలి

- **యువతకు చదువుతో పాటు క్రీడలు చాలా అవసరం**
- **కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంబూరు దయాకర్ రెడ్డి**



**నేలకొండపల్లి, మహా:** గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు క్రీడాకారులు ఎదగాలని ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు తుంబూరు దయాకర్రెడ్డి సూచించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నల్లగొండు జిల్లాల స్థాయి లో జరిగే పోటీలకు పెద్ద మెత్తంలో జట్టులు పాల్గొన్నారు. నేలకొండపల్లి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగు జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... గ్రామీణ స్థాయిలో పోటీలు నిర్వహించటం వలన ' వారిలో ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. యువత, విద్యార్థులకు చదవు తో పాటు క్రీడలు చాలా అవసరమని పేర్కొన్నారు. 'ఈ ప్రాంతంలో ఉన్న యువత క్రీడల పట్ల ఆసక్తి ఉందని గ్రహించినట్లు తెలిపారు. నేలకొండపల్లి లో మిని స్టేడియం ఏర్పాటు కు తన వంతుగా అవసరమైన సహాయం చేస్తానని పేర్కొన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి దృష్టి కి తీసుకెళ్లి ఏర్పాటు కు కృషి చేస్తానని అన్నారు. గ్రామీణ స్థాయిలో నాలుగు జిల్లాల స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహించటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. నిర్వహాకులు వార్డు సభ్యుడు కొడిరెక్క వినోద్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, జిల్లా కాంగ్రెస్ నాయకులు కోడాలి గోవిందరావు, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు,వెంకన్న, పసుపులేటి ఉపేందర్, బొందయ్య, మైశా శంకర్, రాయపూడి రోహిత్, జెర్రిపోతుల సత్యనారాయణ, దోసపాటి శేఖర్, ధీరావత్ రాధాకృష్ణమూర్తి, కడియాల నరేష్, నల్లాని మల్లిఖార్జునావు.. వివిధ పంచాయతీ సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం సరికాదు

ఎన్నికల సమయంలో ఇచ్చిన గిరిజనుల హమీలను విస్మరించారు



**నేలకొండపల్లి, మహా:** గిరిజనుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం సరికాదని బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అన్నారు. మండలం లోని శంకరిగిరితండా లో మంగళవారం గిరిజన మోర్చా మండల కమిటి సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...గిరిజన తండాలలో సమస్యలు తాండవిస్తున్న పాలకులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. నేటికి గుడిసెలలో జీవనం సాగిస్తున్నారని అన్నారు. అర్హత కలిగిన ప్రతీ గిరిజనుడుకు ఇంటిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఆరోపించారు. గిరిజనులను మోసం చేస్తున్న ప్రభుత్వం పై తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. తండాల ను పంచాయతీలు గా చేసి నిధులు ఇవ్వకుండా చేస్తున్నారని అన్నారు. వెంటనే తండాలకు ప్రత్యేక నిధులు ద్వారా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల న్యాయమైన పోరాటాలకు బీజేపీ అండగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు మూడు రమేష్, బానోత్ శ్రీను, తేజావత్ హనుమంత్, సిద్ధార్ధ, బానోత్ పవన్, తేజావత్ గోపిచంద్, బీజేపీ మండల ఉపాధ్యాక్షుడు కొండా హర్షవర్ధన్, పుట్టా సత్యనారాయణ, కందరబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.

## వాకా రంగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన తుంబూరి దయాకర్ రెడ్డి



**నేలకొండపల్లి, మహా:** నేలకొండపల్లి మండల కేంద్రం లో ఇటీవల అనారోగ్యంతో మరణించిన వాకా రంగయ్య కుటుంబ సభ్యులను రెవెన్యూ,గృహ నిర్మాణం,సమాచార శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జి తుంబూరి దయాకర్ రెడ్డి పరామర్శించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు,కాంగ్రెస్ జిల్లా నాయకులు కొడాలి గోవింద రావు,జెర్రిపోతుల అంజని,బచ్చలకూరి నాగరాజు,రోహినాద్, వెంకటేశ్వర్లు , కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు..

## సీతారామచంద్ర స్వామి కళ్యాణం ఏర్పాట్లపై పంచాయతీ పనుల పర్యవేక్షణ



**భద్రాచలం మహా :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం లో నిర్వహించబడనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి మరియు శుభ్రత పనులను సర్పంచ్ పూనెం కృష్ణ పర్యవేక్షించారు.

**పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు**

కళ్యాణోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో రోడ్లు, శుభ్రత, నీటి సదుపాయాలు, వెలుగు ఏర్పాటు వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సర్పంచ్ ఆదేశాలు జారీ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని సూచించారు.

**భక్తులకు మెరుగైన వసతులపై దృష్టి**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ సీతారాముల కళ్యాణం భద్రాచలం ప్రాంతానికి అత్యంత ప్రాధాన్యమైన పండుగ అని, ఈ సందర్భంగా గ్రామంలో అన్ని వసతులు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం ప్రతి అంశాన్ని పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శి చెరుకుమిల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రత్నం రమాకాంత్, నర్రా రాము, రౌతుల కృష్ణ, చింతాడి రామకృష్ణ, 13వ వార్డు మెంబర్ తాటి ఉదయ్, యూత్ కాంగ్రెస్ నాయకులు గాడి విజయ్, మాచినేని భాను, సాయి పవన్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల పట్ల తక్షణమే స్పందించాలి..

- **పోలీస్ స్టేషన్ల తనిఖీలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్..**
- **కేసుల దర్యాప్తులో అలసత్వం వద్దు..**
- **తిప్పర్తి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ..**



**నల్గొండ, మహా :** ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన సేవలు అందించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ పేర్కొన్నారు. మంగళవారం నల్లగొండ సబ్ డివిజన్ పరిధిలోని తిప్పర్తి పోలీస్ స్టేషన్ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు రోజుల పాటు సాగిన ఈ తనిఖీల్లో భాగంగా స్టేషన్ రికార్డులను, సిబ్బంది పనితీరును కూలంకషంగా పరిశీలించారు. స్టేషన్లోని రిసెప్షన్ మేనేజ్మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, రైటర్ విభాగం, లాకప్ గదులను ఎస్పీ స్వయంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల విచారణలో ఎలాంటి జాప్యం జరగకూడదని నిందితులకు చట్టప్రకారం శిక్ష పడేలా పక్కా ఆధారాలతో కోర్టులో ప్రవేశపెట్టాలని ఆదేశించారు. బాధితులు స్టేషన్కు వచ్చినప్పుడు వారి పట్ల మర్యాదగా ప్రవర్తించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. గ్రామ పోలీసు అధికారులు (GPOs) ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజలతో మమేకం కావాలని ఎస్పీ సూచించారు. అత్యవసర పిలుపులు వచ్చినప్పుడు బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది నిమిషాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరుకోవాలి. నేరాల అదుపునకు పట్టణ, గ్రామ పరిధిలో మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలి. పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు.

**అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం..**

గంజాయి విక్రయాలు, అక్రమ ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం మళ్లింపు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు గాను డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, మైనర్ డ్రైవింగ్లపై ప్రత్యేక డ్రైవ్లు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.ఈ తనిఖీ కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి, తిప్పర్తి ఎస్సై శంకర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## పిల్లి రామరాజు యాదవ్ గృహ నిర్బంధం..

- **అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా పోలీసుల అడ్డుకోలు..**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ నేత ధ్వజం**

**నల్గొండ, మహా :** బిజెపి పార్టీ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో బీజేపీ నాయకుడు పిల్లి రామరాజు యాదవ్ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. మంగళవారం తెల్లవారుజామునే ఆయన నివాసానికి చేరుకున్న పోలీసులు, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆయనను బయటకు రాకుండా అడ్డుకున్నారు. అనంతరం అరెస్టు చేసి స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్కు తరలించారు.

**ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ ఎక్కడ?**

ఈ సందర్భంగా రామరాజు యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు, ప్రతిపక్షాలకు కనీస స్వేచ్ఛ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. "ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కూడా ఈ ప్రభుత్వం కాలరాస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన అణచివేత ధోరణి కంటే మిన్నగా కాంగ్రెస్ సర్కార్ వ్యవహరిస్తోంది" అని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, కాంగ్రెస్ పతనానికి ఇవే నాంది అవుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో త్వరలోనే బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని, అప్పుడు ఇప్పుడు అక్రమాలకు పాల్పడుతున్న వారు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని రామరాజు యాదవ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



## దైవ మార్గంలోని విముక్తి దొరుకుతుంది

**శ్రీ సంగమేశ్వర ఆలయ నగర సంకీర్తన కార్యక్రమంలో ప్రధాన పూజారి జి మోహన్ రావు**

**మహా :** సదాశివపేట ప్రతి ఒక్కరికి దైవ మార్గంలోని విముక్తి దొరుకుతుందని శ్రీ సంగమేశ్వర మందిరం ఆలయ ప్రధాన పూజారి జి. మోహన్ రావు అన్నారు. మంగళ వారం విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు నాగుల పల్లి పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నగర సంకీర్తన భాగంగా 13వ రోజు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వర మందిరం నుండి ప్రారంభమైన నగర సంకీర్తన శ్రీరామ జయ రామ జయజయ రామ నామ కీర్తనలతో ఎడ్ల బజార్ బసవేశ్వర మందిరం. నాగుల కట్ట మీదగా శ్రీ బక్కప్ప మందిరం. నుండి శ్రీ సంగమేశ్వర మందిరం చేరుకొని ఆలయంలో ప్రధాన పూజారులు జి మోహన్ రావు. బి ఎన్ శంకర్రావు. బి ఎన్ నారాయణరావుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి. సామూహిక లింగాష్టకం. హనుమాన్ చాలీసా పారాయణము తదితర పూజలు నిర్వహించి పాల్గొన్న భక్తులందరికీ తీర్థ ప్రసాదాలతో పాటు అల్పాహారం అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో పట్టణ లో నీ ఆయా మందిరాల నిర్వాహకులు. విశ్వహిందూ పరిషత్. హిందూ సంఘాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పెద్దాసుపత్రిలో పేషేంట్లపై చిన్నచూపు!

- **అత్యవసర విభాగంలో వైద్య సిబ్బంది నిర్వాకం..**
- **గాయపడిన వారికి వార్డు బాయ్లతోనే కుట్లు..**
- **యాక్సిడెంట్ కేసుల్లో ఆసుపత్రి కి వచ్చిన వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది..**
- **ఐడెంటిటీ కార్డుల కోసం పేచీ బాధితుల బంధువుల ఆవేదన..**




**నల్లగొండ, మహా బ్యూరో :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జీజీహెచ్)లో రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పేరుకు మాత్రమే అది 'పెద్ద' ఆసుపత్రి కానీ, అక్కడ అందుతున్న సేవలు మాత్రం అత్యంత అధ్వాన్నంగా ఉన్నాయనేది బాధితుల ఆరోపణ. ముఖ్యంగా అత్యవసర విభాగం (క్యాజువాలిటీ)లో విధులు నిర్వహించే సిబ్బంది వ్యవహారశైలి మరీ దారుణంగా తయారైందని ప్రాణాపాయ స్థితిలో వచ్చిన వారిని కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దూర ప్రాంతాల్లో యాక్సిడెంట్ లు జరిగి ప్రాణం పోయే స్థితి లో వున్న ప్రమాద బాధితులు ఆసుపత్రి కి వస్తే తక్షణమే వైద్యం అందించాల్సిన సిబ్బంది మాత్రం పెషేంట్ బంధువులు (అటెండర్స్) లేరనే సాకుతో ట్రీట్మెంట్ చేయకుండా ప్రాణాలతో చెలగాటం ఆడుతూ పెషేంట్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రాణం కంటే ఆధార్ కార్డే ముందా?**

నకిరేకల్ , మాడుగులపల్లి, షాపెల్లి గ్రామాలకు చెందిన పలువురు బాధితులు ప్రమాదాల బారిన పడి చికిత్స కోసం ఆసుపత్రికి రాగా, అక్కడ వింత అనుభవాలు ఎదురైనాయట.. దెబ్బలు తగిలి తీవ్ర రక్తస్రావంతో స్ట్రెచ్చర్పై ఉన్న బాధితులకు తక్షణమే వైద్యం అందించాల్సింది పోయి.. అక్కడి నర్సులు, డాక్టర్లు 'ఆధార్ కార్డు ఉందా? ఐడెంటిటీ ప్రూఫ్ చూపిస్తేనే చికిత్స చేస్తాం' అంటూ కాలయాపన చేయడం చర్చనీయాంశంగా మారింది. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న వారిని కాపాడటం కంటే కాగితాలకే సిబ్బంది ప్రాధాన్యత ఇస్తున్నారని బాధితుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అటెండర్లే 'వైద్యులు'వార్డు బాయ్లతోనే కుట్లు..**

ప్రభుత్వం నుంచి లక్షల రూపాయల జీతాలు తీసుకుంటున్న వైద్యులు, నర్సులు తమ బాధ్యతను గాలికొదిలేశారా? ప్రమాదాల్లో గాయపడిన వారికి కనీసం కుట్లు (స్టిచెస్) వేసే ఓపిక కూడా వారికి లేకపోవడం గమనార్హం. అర్హత లేని వారితో (అటెండర్లు, వార్డు బాయ్ల) తో వైద్యం చేయిస్తున్నారని క్లిష్టమైన సమయాల్లో వారు వేస్తున్న కుట్ల వల్ల ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉందని రోగులు ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రి యంత్రాంగం కళ్లముందే ఇదంతా జరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం విశేషం.

**మృతదేహాల పట్ల అమానుషం..**

గుర్తుతెలియని వ్యక్తులు ప్రమాదాల్లో చనిపోతే వారి మృతదేహాలను పోస్టుమార్టం గదికి తరలించేందుకు కూడా సిబ్బందికి బద్ధకమని ఆసుపత్రి లో మృతి చెందిన మృతుల బంధువులు ఎవరైనా ఆసుపత్రి ఆవరణలో ఏడిస్తే 'మీ ఏడుపులు మాకు చిరాకు కలిగిస్తున్నాయి.. శబ్దం చేయొద్దు' అంటూ సిబ్బంది గద్దించడం అక్కడ మానవత్వం మంటగలిసిందని స్పష్టమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు, బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

## నాడు పట్టాలు.. నేడు తిప్పలు.. ఇకపై ఉండవు ఇబ్బందులు!

- **గిరిజన పల్లెల్లో కలెక్టర్ సందడి పదేళ్ల తర్వాత పాగిళ్ల గ్రామాన్ని సందర్శించిన జిల్లా స్థాయి అధికారి..**
- **భూ సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళిక..**
- **ఏప్రిల్ 15 నుంచి 'పాగిళ్ల' భూముల సర్వే**
- **అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై దిశానిర్దేశం..**



**నల్గొండ, మహా :** మారుమూల గిరిజన ప్రాంతాలైన పొగిళ్ల, కంబాలపల్లి గ్రామాల్లో దశాబ్దాలుగా నెలకొన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ భరోసా ఇచ్చారు. సుమారు పదేళ్ల తర్వాత ఓ జిల్లా కలెక్టర్ స్థాయి అధికారి తమ గ్రామానికి రావడంతో గిరిజన రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డితో కలిసి ఆయా గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు.

**క్షేత్రస్థాయిలో సమస్యల పరిశీలన..**

ముందుగా పొగిళ్ల గ్రామానికి చేరుకున్న కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్లు, పాఠశాల వసతులను స్వయంగా పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో తెలుగు శతకాలు, పద్యాలను చదివించారు. యూనిఫాం ధరించాలని సూచిస్తూనే విద్యార్థులు మధ్యలో బడి మానకుండా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. 'అమ్మ ఆదర్శ పాఠశాల' నిధులతో అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు.

**భూ సమస్యపై స్పష్టత ఏప్రిల్ 15 నుంచి సర్వే..**

పొగిళ్లలోని సర్వే నంబర్ 2లో ఉన్న 1,056 ఎకరాల భూమిపై నెలకొన్న గందరగోళంపై కలెక్టర్ రైతులకు క్లారిటీ ఇచ్చారు. కంబాలపల్లిలో ప్రస్తుతం కొనసాగుతున్న మోకా సర్వే పూర్తి కాగానే, ఏప్రిల్ 15 నుండి పొగిళ్లలో ప్రత్యేక సర్వే బృందాలతో సర్వే ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుత పట్టాలు క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం జాబితాను పంచాయతీ నోటీసు బోర్డులో పెడతామని అభ్యంతరాల పరిష్కారం తర్వాత 'భూభారతి' ద్వారా అర్హులైన రైతులకు పట్టాలు ఇస్తామని ప్రకటించారు.

**సంక్షేమ పథకాలు స్వయం ఉపాధి..**

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం సెరికల్చర్, కిరాణా, టెంట్ హౌస్ వంటి వ్యాపారాలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అలాగే వివాదాల కారణంగా నిలిచిపోయిన గ్రామ సమాఖ్య భవన నిర్మాణాన్ని తక్షణం ప్రారంభించాలని పంచాయతీరాజ్ ఇంజనీర్లను ఆదేశించారు.

## డీటీఓ ఆఫీసులో మామూళ్ల పర్వం!

- **'కాసులు' కురిపిస్తేనే ఫైలు కదిలేది..**
- **డీటీఓ కార్యాలయంలో అడుగడుగునా అవినీతి అక్రమాలు..**
- **పైసా ముట్టందే పని చేయని వైనం బాధితుల ఆవేదన..**
- **అద్దె వాహనల బిల్లులకూ 'మామూళ్ల' గండం..**




**నల్గొండ మహా :** నల్గొండ జిల్లా ట్రెజరీ (డీటీఓ) కార్యాలయం అవినీతికి నిలయంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "పైసా ముట్టందే ఫైలు కదలదు.. రేటు కుదిరితేనే పని జరుగుతుంది" అన్న చందంగా అక్కడి పరిస్థితి తయారైందని బాధితులు బహిరంగంగానే వాపోతున్నారు. జీతాల ఫైళ్లు, పెన్షన్లు, చివరికి సీపీఎస్ లోన్ల విషయంలోనూ అధికారుల 'చేయి తడిపితేనే' సంతకాలు చేస్తున్నారని ఫైళ్ళు ముందుకెళ్తాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**రూ. 10 వేలు ఇస్తేనే బిల్లు లేదంటే కొర్రీలే..**

తాజాగా జిల్లాలోని నకిరేకల్, నార్కట్ పల్లి, చిట్యాల, కనగల్, తిప్పర్తి మండలాల తహసీల్దార్ కార్యాలయాలకు అద్దె ప్రాతిపదికన నడిచే వాహనాల బిల్లుల విషయంలో ఓ అధికారి బేరసారాలకు దిగడం చర్చనీయాంశమైంది. గతంలో అద్దెకు పెట్టిన తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయ వాహన బిల్లు క్లియర్ చేయాలంటే రూ. 10,000 లంచం ఇవ్వాలని సదరు అధికారి నేరుగా వాహన యజమానిని డిమాండ్ చేసినట్లు సమాచారం. లంచం ఇచ్చేందుకు యజమాని నిరాకరించడంతో, 'కంటిన్యూయేషన్ ఆర్డర్' (కొనసాగింపు ఉత్తర్వు) లేదనే సాకుతో 8 నెలలుగా బిల్లును తొక్కిపెట్టారని బాధితుడు ఆరోపిస్తున్నారు.

**నిబంధనల్లో వివక్ష ఎందుకు?**

పక్కనే ఉన్న కనగల్, నకిరేకల్ మండలాలకు చెందిన వాహనాలకు ఎటువంటి కంటిన్యూయేషన్ లెటర్లు లేకపోయినా బిల్లులు ఎలా మంజూరు చేశారని బాధితుడు ప్రశ్నిస్తున్నారు. "వారికి ఎలా చేశారు నాకెందుకు చేయరు?" అని నిలదీస్తే, "పైనుంచి ఓరల్ ఇన్స్ట్రక్షన్స్ (మౌఖిక ఆదేశాలు) ఉన్నాయి.. బిల్లులు చేయొద్దని ఆర్డర్ ఉంది" అంటూ అధికారులు కుంటి సాకులు చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఇది కేవలం లంచం ఇవ్వలేదన్న కక్షతోనే చేస్తున్న వివక్ష అని బాధితుడు మండిపడుతున్నారు.

**ఎనిమిది నెలల నిరీక్షణ మార్చి నెలాఖరు గండం..**

గత 8 నెలలుగా అద్దె రాకపోవడంతో వాహన యజమాని ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహన ఈఎంఐలు, నిర్వహణ ఖర్చులు భరించలేక సతమతమవుతున్నారు. ఈ నెల 31తో ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో, ఆలోగా బిల్లులు ప్రాసెస్ కాకపోతే బడ్జెట్ లాప్స్ (వెనక్కి వెళ్లే) అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టరును కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. తన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు.

## మణుగూరులో ప్రత్యేక వైద్య శిబిరం..



**మణుగూరు, మహా :** ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ఆరోగ్య ప్రచారం.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సునీల్ నాయకత్వంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయగా.. శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రావు, సీఐ నాగబాబు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌరి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు నవీన్, శివ సైదులు తదితరులు సందర్శించి వైద్య సిబ్బందిని అభినందించారు. ఈ శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ సునీత, చిల్డ్రన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఐ స్పెషలిస్ట్ డాక్టర్ కేశవరావు, ఆర్థోపెడిక్ డాక్టర్ చంద్రహాస్, డెంటల్ డాక్టర్ గౌరి ప్రసాద్, జనరల్ డాక్టర్ అఖిల్ లు వైద్య సేవలు అందించారు. మొత్తం 238 మంది రోగులు వైద్య సేవలు పొందగా, 38 మందికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. 59 మందిని మెరుగైన చికిత్స కోసం ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేశారు. విభాగాల వారీగా స్త్రీ, ప్రసూతి వైద్యం 62, ఎముకల వైద్యం 46, కంటి వైద్యం 28, దంత వైద్యం 21, శిశు వైద్యం 10, సాధారణ వైద్యం 71 మంది చికిత్స పొందారు. ఈ శిబిరం నిర్వహణలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సదాశివపేటలో విజిలెన్స్ దాడులు..

**హోటళ్లపై ఆకస్మిక సోదాలు.. 22 గ్యాస్ సిలిండర్లు సీజ్!**

**మహా : సదాశివపేట:** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, సివిల్ సప్లై అధికారులు మంగళవారం మెరుపు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా గృహ అవసరాలకు వాడే (డొమెస్టిక్) గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వాడుతున్నారన్న సమాచారంతో పలు హోటళ్లు, బేకరీలు, స్వీట్ హోంలలో సోదాలు చేపట్టారు. 6ఏ ఇసి యాక్ట్ ప్రకారం 6 కేసులు నమోదు చేసి, 22 గ్యాస్ సిలిండర్లు సీజ్ చేశారు. గృహ అవసరాల కోసం ప్రభుత్వం కేటాయించే సిలిండర్లను వ్యాపారాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీసిఎస్ స్వరూప హెచ్చరించారు. సదాశివపేట పట్టణంలో గ్యాస్ కొరత ఏమీ లేదని, తగినంత స్టాక్ అందుబాటులో ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ బృందం సభ్యులు డి.ఎస్.పి వెంకటేశం, సిఐ పండరి, ఎస్సై సాంబశివ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## ద్విచక్ర వాహనం నడిపిస్తూ ఆగి ఉన్న వాహనాన్ని ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి

**రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..**

**రాజేంద్రనగర్, మహా ;** టూ వీలర్ వెహికల్ నడుపుతూ ఆగి ఉన్న డీసీఎం వాహనాన్ని ఢీకొని మృతి చెందిన సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తరుణ్ కుమార్, (23) నల్లకుంట పీజీ హాస్టల్లో ఉంటూఓలా ఉబర్ క్యాబ్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు, తరుణ్ కుమార్ టిఎస్ 08 హెచ్ఆర్ 1817 గల ద్విచక్ర వాహనం నడుపుతూ శంషాబాద్ నుండి షాద్ నగర్ వైపు వెళ్తూ పెద్దషాపూర్ నేషనల్ హైవే 44 సర్వీస్ రోడ్ పై ఆగి ఉన్న మహారాష్ట్ర నెంబర్ ప్లేట్ కల ఎంహెచ్ 14 జి యు 6650 గల వాహనాన్ని ఢీకొనడంతో తలకు బలమైన గాయమై తరుణ్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలాంటి ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయకుండా ఇష్టానుసారం డీసీఎం డ్రైవర్ శివాజీ బోస్ సర్వీస్ రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలపడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

**ప్రజా పాలన పట్టణ ప్రణాళిక అవగాహన ర్యాలీలో జిహెచ్ఎంసి అధికారులు**

**రాజేంద్రనగర్, మహా :** 99 రోజుల ప్రజా పాలన పట్టణ ప్రణాళికలో భాగంగా డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, తిరుపతి (డిఈఈ ఎస్డబ్ల్యూఎం), ఏఈ అశీష్, ఇతర సిబ్బంది తో కలిసి మంగళవారం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని అన్ని వార్డులలో శానిటేషన్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. శానిటేషన్ వర్కర్లు, ఆర్పీలు, ఎస్ఎఫ్ఏలు, ఎస్ఎస్లు, సీఓలు కలిసి జి వి పి లను గుర్తించి వాటిని తొలగించారు.ప్రతిరోజు ఎస్ఏ టి ఆటోలకు తమ ఇంటి చెత్తనుఇవ్వాలని ప్రజలకు జిహెచ్ఎంసి అధికారులు సూచించారు. ప్రతి కుటుంబం తమ బాధ్యతగా పరిసరాలను చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలి.ఆరోగ్యకరమైన పరిసరాల కోసం ఇది ప్రతి ఒక్కరి బాధ్యతగా నిర్వహించాలన్నారు.



## రెండు గంటల్లోనే బాలుడి ఆచూకీ లభ్యం

**మొయినాబాద్ మహా:** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని మొయినాబాద్ పోలీస్ స్టేషన్కు చెందిన పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి తప్పిపోయిన ఐదేళ్ల బాలుడిని కేవలం రెండు గంటల్లోనే గుర్తించి తల్లికి క్షేమంగా అప్పగించారు.వివరాల్లోకి వెళ్తే... అనిరుధ్ అనే ఐదేళ్ల బాలుడిని అతని తల్లి రోజువారీ కూలీ పనికి వెళ్లే సమయంలో పరిచయస్తుల వద్ద ఉంచింది. అయితే బాలుడు ఆడుకుంటూ ఎవరికీ తెలియకుండా బయటకు వెళ్లి వీధుల్లో తిరుగుతుండగా, అదే సమయంలో అతని అక్క పిన్ని ఇంటి వద్ద ఉండి పదో తరగతి పరీక్షలు రాస్తోంది. తమ్ముడు రోడ్డుపై ఒంటరిగా తిరుగుతుండటాన్నిగమనించిన ఆమె, అతన్ని ఆటోలో తీసుకుని తన వద్దకు తీసుకెళ్లింది.ఇదిలా ఉండగా, పని ముగించుకుని ఇంటికి వచ్చిన తల్లికి బాలుడు కనిపించకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయించింది. వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా బాలుడు షేర్ ఆటోలో వెళ్లినట్లు గుర్తించిన క్రైమ్ పీసీ కరుణాకర్, సంబంధిత డ్రైవర్ను సంప్రదించి బాలుడి ఆచూకీని గుర్తించారు.తరువాత బాలుడు తన అక్క వద్ద సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారించి, కేవలం రెండు గంటల్లోనే తల్లికి అప్పగించారు. వేగంగా స్పందించి బాలుడిని క్షేమంగా అప్పగించిన పోలీస్ సిబ్బందిని బాలుడి తల్లి హృదయపూర్వకంగా అభినందించారు.పోలీసులు తల్లిదండ్రులకు పిల్లలపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112 కు కాల్ చేయాలని కోరారు.

## ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికను బాధ్యతాయుతంగా చేపట్టాలి

- ఈ వేసవిలో త్రాగునీటికి కొరత రాకుండా చూడాలి
- జిల్లా అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు
- జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, శ్రీనివాస్ లతో కలిసి, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 10 థీముల తో చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, మున్సిపాలిటీల, గ్రామ పంచాయతీల వారీగా పారిశుధ్యం పనులు, విద్యుత్ కు సంబంధించిన మరమ్మత్తులు, భవనాల మరమ్మత్తులు, పెయింటింగ్ వంటి పనులు పూర్తి చేయాలని, కార్యాలయాల పరిశుభ్రత, ఫైళ్ళ క్లియరెన్స్ పూర్తి చేయాలని, ఏ ఒక్క శాఖలో కూడా ఒక్క ఫైల్ కూడా పెండింగ్లో ఉండకుండా పరిష్కరించాలని సూచించారు. మంజూరైన పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు వాటి పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. జనన మరణ ధృవీకరణ పత్రాల జారీ, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఫైల్ లు క్లియర్ చేయాలని అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్లక్ష్య వైఖరితో కాకుండా బాధ్యతతో ప్రతి ఒక్కరూ తమకు నిర్దేశించిన పనులను పూర్తి చేయాలని, నిర్లక్ష్యంగా పని చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో సమర్ధవంతగా నిర్వహించి విజయవంతగా పూర్తి చేసేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని తెలిపారు. ప్రతి శాఖ ఈఆఫీస్ నిర్వహణ చేపట్టాలని సూచించారు.

**త్రాగునీటికి కొరత రాకుండా చూడాలి.....**

ప్రస్తుతం వేసవి కాలం అయినందున జిల్లాలో ఏ ఒక్క చోట కూడా త్రాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని, అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని, పైపు లీకేజులు లేకుండా చూడాలని, ఎక్కడ నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, అవసరమైన చోట బోరు మోటార్లు, హ్యాండ్ పంపులు, ఇతర తాగునీటి వనరులకు మరమ్మతు పనులు జరిపించాలని అన్నారు. జిల్లా స్థాయి అధికారులు మారుమూల ప్రాంతాలను సైతం సందర్శిస్తూ నీటి సరఫరా తీరుతెన్నుల గురించి వారి ద్వారా క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. ప్రస్తుత వేసవి సీజన్ దృష్ట్యా మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులు, ఎంపిడిఓలు సమన్వయంతో, సమిష్టిగా పని చేయాలని అన్నారు. నీటి కొరత ఏర్పడకుండా చేపడుతున్న చర్యలు ప్రజలకు తెలిసేలా చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె.శ్రీనివాస్, డీఆర్ఓ సంగీతం, జడ్పీ సి ఈ ఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేశ్ మోహన్, సిపిఓ సౌమ్య, పిడి డీఆర్డీఏ శ్రీలత, వ్యవసాయ శాఖ అధికారి ఉషా, పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, పౌరసరఫరాల శాఖ మేనేజర్ హరీష్, మిషన్ భగీరథ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు రామరావు, నవీన్ కుమార్ రెడ్డి, కేషురామ్, కె.రామవేశ్వరి దేవి, పద్మావతి, ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంపిఒలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాయు కాలుష్యం

- ప్రపంచంలో 6వ స్థానంలో భారత్.. పాకిస్థాన్ టాప్!
- యూపీలోని లోనీ పట్టణమే ప్రపంచంలో అత్యంత కాలుష్య నగరం.
- టాప్-10లో ఐదు నగరాలు మనవే!
- రాజధాని దిల్లీలో ప్రాణాంతక గాలి.
- అత్యంత కాలుష్య నగరాల జాబితాలో 4వ స్థానం!
- డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలు గాలికి.
- పీఎం 2.5 మోతాదుతో పెరుగుతున్న ప్రాణగండం!
- గ్లోబల్ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ నిలిపివేతతో డేటా కరువు!



**హైదరాబాద్, మహా ప్రత్యేకం.** అభివృద్ధి పరుగులో పర్యావరణాన్ని విస్మరిస్తున్న మానవాళికి స్విట్జర్లాండ్కు చెందిన 'ఐక్యూఎయిర్' సంస్థ విడుదల చేసిన 'వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2025' తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ప్రపంచవ్యాప్తంగా వాయు కాలుష్యం కోరలు చాస్తోందని, స్వచ్ఛమైన గాలి పీల్చుకోవడం అనేది ఇప్పుడు ఒక విలాసంగా మారుతోందని ఈ నివేదిక స్పష్టం చేసింది. 143 దేశాల్లోని 9,446 నగరాల వాయు నాణ్యతను విశ్లేషించి రూపొందించిన ఈ నివేదికలో భారత్ పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉంది. అత్యంత కాలుష్యమయ దేశాల జాబితాలో పొరుగున ఉన్న పాకిస్థాన్ మొదటి స్థానంలో నిలవగా, భారత్ ఆరో స్థానంలో నిలిచింది. గాలిలో ప్రాణాంతకమైన పర్టిక్యులేట్ మ్యాటర్ (పీఎం 2.5) మోతాదు ఆధారంగా ఈ ర్యాంకింగ్స్ కేటాయించారు. బంగ్లాదేశ్, తజికిస్తాన్, చాద్, కాంగో దేశాలు వరుసగా రెండు నుంచి ఐదు స్థానాల్లో ఉన్నాయి.

భారతదేశం తలదించుకునేలా, ప్రపంచంలోనే అత్యంత కాలుష్యమయ నగరంగా ఉత్తరప్రదేశ్లోని గాజియాబాద్ సమీపంలో ఉన్న 'లోనీ' పట్టణం నిలిచింది. ఇక్కడ గాలిలో పీఎం 2.5 మోతాదు క్యూబిక్ మీటర్కు ఏకంగా 112.5 మైక్రోగ్రామ్స్ ఉన్నట్లు నమోదైంది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల కంటే ఏకంగా 22 రెట్లు ఎక్కువ కావడం గమనార్హం. ఇక ప్రపంచంలోని టాప్10 కాలుష్య నగరాల్లో ఐదు నగరాలు భారత్లోనే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. లోనీ (యూపీ), బైర్నీహట్ (మేఘాలయ), దిల్లీ, గాజియాబాద్ (యూపీ), ఉలాబిర్హ్ నగర్ (పశ్చిమ బెంగాల్) నగరాలు ఈ జాబితాలో ఉన్నాయి. భారత రాజధాని దిల్లీ అత్యంత కాలుష్య నగరాల జాబితాలో 4వ స్థానంలో నిలవడం రాజధాని వాసుల ఆరోగ్య భద్రతపై ప్రశ్నార్థకంగా మారింది. టాప్25 కాలుష్య నగరాలన్నీ కేవలం భారత్, పాకిస్థాన్, చైనాలలోనే కేంద్రీకృతమై ఉండటం ఆసియా ఖండానికి పొంచి ఉన్న పర్యావరణ ముప్పును సూచిస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా డబ్ల్యూహెచ్ఓ నిర్దేశించిన గాలి నాణ్యతా ప్రమాణాలను కేవలం 13 దేశాలు, ప్రాంతాలు మాత్రమే అందుకోగలిగాయని నివేదిక తేల్చిచెప్పింది. ఫ్రెంచ్ పోలినేషియా, ప్యుయెర్టో రికో, బార్బడోస్, ఆస్ట్రేలియా, ఎస్టోనియా వంటివి ఈ స్వచ్ఛమైన జాబితాలో ఉన్నాయి. వాతావరణ మార్పుల వల్ల ఉత్తర అమెరికా, ఐరోపా దేశాల్లో సంభవించిన కార్చిచ్చు ఘటనలు ప్రపంచ గాలి నాణ్యతను తీవ్రంగా దెబ్బతీశాయి. అమెరికాలో గాలి నాణ్యత క్షీణించి పీఎం 2.5 సగటు 7.3 మైక్రోగ్రామ్స్కు చేరుకుంది. అయితే అమెరికాలోని సియాటెల్ నగరం మాత్రం వరుసగా రెండో ఏడాది అత్యంత స్వచ్ఛమైన నగరంగా నిలిచింది. మరోవైపు సహారా ఇసుక తుఫానుల వల్ల స్విట్జర్లాండ్, గ్రీస్ దేశాల్లో కాలుష్యం 30 శాతం పెరిగింది.

**ట్రంప్ నిర్ణయంతో తగ్గిన పర్యవేక్షణ**

గాలి నాణ్యతను అంచనా వేయడంలో అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయం తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఆయన రెండోసారి బాధ్యతలు స్వీకరించిన వెంటనే 'గ్లోబల్ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ ప్రోగ్రాం'ను నిలిపివేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా ఎంబసీల ద్వారా అమలయ్యే ఈ ప్రోగ్రాం ఆగిపోవడంతో, మార్చి 2025 నుంచి గాలి నాణ్యతపై నిర్దిష్టమైన డేటా సేకరణ కష్టంగా మారింది. దీనివల్ల 44 దేశాల్లో పర్యవేక్షణ తగ్గిపోయిందని సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ ఆందోళన వ్యక్తం చేసింది. సరైన గణాంకాలు ఉంటేనే కాలుష్య నివారణ చర్యలు చేపట్టగలమని ఐక్యూఎయిర్ సంస్థ సీఈఓ ఫ్రాంక్ హ్యామ్స్ అభిప్రాయపడ్డారు. గాలిలోని అతిసూక్ష్మ కాలుష్య కారకాలైన పీఎం 2.5 నేరుగా రక్తంలోకి చేరి శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులకు దారితీస్తాయని, దీనిపై ప్రభుత్వాలు తక్షణమే మేల్కోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ప్రజా హితమే ప్రాతిపదికగా పునర్విభజన

- వంద మందికి సరికొత్త రాజకీయ వేదిక
- అసెంబ్లీలో యువతకు పట్టాభిషేకం
- 2009 తప్పులు పునరావృతం కావొద్దు
- నియోజకవర్గాల పునర్విభజన పారదర్శకంగా జరగాలి!
- అధికార దుర్వినియోగానికి తావులేదు
- పాలకులకు, ప్రజలకు మధ్య వారధిగా నూతన నియోజకవర్గాలు!
- జనసేన శ్రేణులకు పవన్ కళ్యాణ్ పక్కా దిశానిర్దేశం!

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో రాబోయే రోజుల్లో రాజకీయ ప్రకంపనలు సృష్టించనున్న నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టమైన వైఖరిని కుండబద్దలు కొట్టారు. మంగళవారం శాసనసభాపక్ష (ఎల్పీ) సమావేశంలో ఆయన ఈ ప్రతిపాదిత ప్రక్రియపై పార్టీ శ్రేణులకు, ఎమ్మెల్యేలకు కీలక దిశానిర్దేశం చేశారు. డీలిమిటేషన్ అనేది కేవలం భౌగోళిక సరిహద్దుల మార్పు లేదా రాజకీయ లెక్కల సర్దుబాటు కాదని, ప్రజా ప్రయోజనమే అంతిమ లక్ష్యంగా ఈ ప్రక్రియ ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. వాస్తవిక దృక్పథంతో, రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా మరియు అత్యంత సహేతుకంగా ఈ పునర్విభజన జరగాల్సిన ఆవశ్యకతను పవన్ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. గతంలో 2009 సంవత్సరంలో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ తీరును, అప్పటి అనుభవాలను ప్రతి ఒక్కరూ ఒకసారి గుర్తుచేసుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు. నాడు జరిగిన భౌగోళిక మార్పుల వల్ల కొన్ని వర్గాలకు జరిగిన లాభనష్టాలను బేరీజు వేసుకుని, ఈసారి ఆ లోటుపాట్లు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత రాజకీయ పక్షాలన్నింటిపైనా ఉందన్నారు. నియోజకవర్గాల స్వరూపం మారే క్రమంలో ప్రజాప్రతినిధులు అన్ని వర్గాల ప్రజలకు మరింత చేరువగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కేవలం ఎన్నికల రాజకీయాలకే పరిమితం కాకుండా, కొత్తగా ఏర్పడే నియోజకవర్గాల్లో ప్రజల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకోవాలని ఎమ్మెల్యేలకు ఆయన సూచించారు. ఈ సుదీర్ఘ ప్రక్రియ ఎక్కడా, ఏ రకంగానూ రాజకీయ స్వార్థ ప్రయోజనాలకు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని పవన్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు గణనీయంగా పెరగనుండటం పట్ల పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాల సంఖ్య ఏకంగా 50 శాతం మేర పెరగడం చారిత్రాత్మక పరిణామమని ఆయన పేర్కొన్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలో కొత్తగా 88 శాసనసభ స్థానాలు, సుమారు 12 వరకు లోక్సభ స్థానాలు పెరిగే అవకాశం ఉందని ఆయన వివరించారు.

## చెరువులకు మహర్దశ

**హైడ్రా కమిషనర్ రంగనాథ్**



**కుషాయిగూడ, మహా :** నియోజకవర్గంలోని అన్ని చెరువుల అభివృద్ధి, సుందరీకరణకు చేయనున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. హెచ్ఎంటి పెద్ద చెరువును కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జీ పరమేశ్వర్రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులుతో కలిసి మంగళవారం రంగనాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని చెరువులను రూ.102 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టుగా ఆయన పేర్కొన్నారు. చెరువులలో అభివృద్ధితో పాటు సుందరీకరణ పనులను కూడా చేపడుతున్నట్టుగా ఆయన తెలిపారు. అనంతరం పరమేశ్వర్రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని చెరువుల అభివృద్ధి, సుందరీకరణకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో మొదటి విడతలో నాలుగు చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులకు నిధులు సైతం మంజూరు చేయించినట్టుగా చెప్పారు. ఉప్పల్ నల్ల చెరువు రూ.20 కోట్లు, నాచారం(హెచ్ఎంటీనగర్) చెరువు రూ.30 కోట్లు, కాప్రా చెరువు రూ.35 కోట్లు, రామంతాపూర్ పెద్ద చెరువు రూ.17 కోట్ల చొప్పున నిధులొచ్చినట్టుగా తెలిపారు. ఇప్పటికే ఉప్పల్ నల్లచెరువులో పనులను చేపట్టి తుది దశలో ఉన్నాయన్నారు. అతి త్వరలోనే నాచారం. మిగతా చెరువులలో పనులను చేపట్టనున్నట్టుగా పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంటీ కాలనీ ప్రధాన కార్యదర్శి రామకోటేశ్వరరావు, రవీందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, హెచ్ఆర్ మోహన్, ప్రకాష్ రెడ్డి ,అశ్వద్ధామ రెడ్డి, నూతలకంటి రాజు, సంతోష్ రెడ్డి, రాజి రెడ్డి, కృష్ణ యాదవ్, వెంకట్ రెడ్డి, వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## సురంగల్ మున్సిపాలిటీలో బజరంగ్ దళ్ నూతన కమిటీ ఏర్పాటు



**మొయినాబాద్ మహా:** సురంగల్ మున్సిపాలిటీ పరిధిలో బజరంగ్ దళ్ నూతన కమిటీని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బజరంగ్ దళ్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కమిటీ ఏర్పాటు కార్యక్రమంలో బజరంగ్ దళ్ ప్రముఖులు అవుసుల సాయి నందు చారి, సహ ప్రముఖుడు కేసరి ముమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నూతన కమిటీని ప్రకటించారు. సంస్థ బలోపేతం, యువతలో దేశభక్తి, సేవా కార్యక్రమాలపై అవగాహన పెంపొందించేందుకు కమిటీ కృషి చేయాలని వారు సూచించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బజరంగ్ దళ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి ప్రజలకు సేవ చేయాలని తెలిపారు. యువత ముందుకు వచ్చి సంస్థ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సాయి సృజన్ గౌడ్, రోహిత్ రెడ్డి, అభి యాదవ్, అరవింద్ గౌడ్, పాశం మనిష్, శశిధర్ రెడ్డి, దుర్గం చందు, యుగంధర్ రెడ్డి,సన్నీ యాదవ్, కార్యకర్తలు మరియు యువకులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి ఎఫ్ఎండీ నివారణ టీకాలు

**మండల పశు వైద్యాధికారి డాక్టర్ అహ్మద్**



**మొయినాబాద్ మహా:** రైతులందరూ తమ పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి ఎఫ్ఎండీ నివారణ టీకాలు వేయించుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ అహ్మద్ తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ అహ్మద్ అన్నారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలో 247 పశువులకు టీకాలు వేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయక సిబ్బంది పద్మ, ప్రసన్న కుమార్, భీంరావు, ఘోరేమియా, పాడి రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ కేసుపై ముమ్మర దర్యాప్తు...





- విచారణకు హాజరైన పైలెట్ రోహిత్ రెడ్డి
- మొయినాబాద్ డ్రగ్స్ కేసులో కీలక నిందితులు...
- శంషాబాద్ పోలీస్ స్టేషన్ లో ఏడు గంటల విచారణ
- పలు కీలక సమాచారం రాబట్టినట్టు సమాచారం.

**రంగారెడ్డి జిల్లా (రాజేంద్రనగర్) మహా:** మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో కీలక నిందితులు రోహిత్ రెడ్డి, నితీష్ రెడ్డి, నమిత్ శర్మాలను, శంషాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు ఏడు గంటలుగా విచారణ చేపట్టారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, ముగ్గురు నిందితులపై పలు ప్రశ్నల వర్షం కురిపించారు. మొయినాబాద్ ఫామ్ హౌస్ లో ఎన్నిసార్లు పార్టీలు జరుపుకున్నారు, డ్రగ్స్ ఎక్కడి నుంచి తెప్పించారు, ఎవరు తెచ్చి ఇచ్చారు, దుబాయ్ డ్రగ్స్ ఫెడరల్ తో పరిచయాలపై ఆరా తీశారు. ఇప్పటికే నిందితుల నుంచి కాల్ డేటా, సోషల్ మీడియా చాటింగ్స్ ఆధారంగా పోలీసులు కీలక ఆధారాలు స్వీకరించినట్లు తెలుస్తుంది. మూడు రోజుల కస్టడీ విచారణలో మరిన్ని కీలక పరిణామాలు చోటు చేసుకోనే అవకాశం లేకపోలేదు. షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

## చర్లపల్లి డివిజన్ లో సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి



**కుషాయిగూడ, మహా :** చర్లపల్లి డివిజన్లోని టీచర్స్ కాలనీ చక్రిపురం కాలనీలలో మంగళవారం అభివృద్ధి పనులకుఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శ్రీకారం చుట్టారు. కాప్రా సర్కిల్ కుషాయిగూడలోని పోచమ్మ గుడి సమీపంలో స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ డ్రైనేజ్ ద్వారా వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తగ్గుతాయని తెలిపారు. అనంతరం చక్రిపురం కాలనీలో సీసీ రోడ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణంతో కాలనీవాసులకు రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. టీచర్స్ కాలనీలో కూడా సీసీ రోడ్ల పనులను ప్రారంభించి, స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, బుచ్చన్నగారి శ్రీకాంత్ రెడ్డి, నేమూరి మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాసరెడ్డి, ఆలేటి మహిపాల్ రెడ్డి, పాండు నరసింహ గౌడ్, మొగిలి రాఘవరెడ్డి స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చర్లపల్లి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి

**సీఎంను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**



**కుషాయిగూడ, మహా :** ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికై నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. మంగళవారం సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి వచ్చే వారం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనరేట్ ఎంఎంసి భూమి పూజ కార్యక్రమానికి హాజరు కావలసిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉప్పల్ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కూడా నిధులు కేటాయించాలని కోరారు. నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభా, మౌలిక సదుపాయాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ఈ సందర్భంగా సీఎంకు విజ్ఞప్తి చేశారు. రామంతపూర్ ప్రాంతంలో కొత్త పోలీస్ స్టేషన్ను మంజూరు చేయాలని కోరారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని 2009లో నిర్మించిన గృహకాల్ప పథకం కింద నిర్మించిన కాలనీల్లో నీటి లీకేజీలు, డ్రైనేజ్ సమస్యలు, స్లాబ్ పగుళ్లు వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఓపెన్ నాళాకు నిధులు కేటాయించాలని కోరారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడంలేదని ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. కాలనీల చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో వాటిని రక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలన్నారు. పటేల్ కుంట, రామాంతాపూర్ చిన్న చెరువులను అభివృద్ధి చేయాలని కోరారు.

## మండి బిర్యానీ వికటించి నలుగురికి అస్వస్థత

**ఏఎస్ రావు నగర్లో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి**

**కుషాయిగూడ, మహా :** ఏఎస్ రావు నగర్లో ఉన్న 'డిలీసియస్ మండి' హోటల్లో బిర్యానీ తిని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన గత మూడు రోజుల క్రితం జరగగా, బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం.. స్థానిక నివాసితులైన ఉమేష్, రాధిక, నరసింహ మరియు నాలుగు సంవత్సరాల బాలుడు విహాల్ కలిసి



సదరు హోటల్లో మండి బిర్యానీ తిన్నారు. తిన్న కొద్దిసేపటికే వారందరికీ వాంతులు, విరోచనాలు ప్రారంభమయ్యాయి. పరిస్థితి విషమించడంతో వెంటనే వారిని జమ్మిగడ్డలోని ఒక ప్రైవేట్ క్లినిక్కు తరలించారు. ఫుడ్ పాయిజనింగ్ కారణంగా బాధితులు గత మూడు రోజులుగా ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. చిన్నారి విహాల్ పరిస్థితిపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హోటల్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే నాసిరకం ఆహారం వడ్డించారని, అందుకే తమకు ఈ పరిస్థితి ఎదురైందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఆహార భద్రతా అధికారులు స్పందించి సదరు హోటల్పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# హిట్స్ ఉన్నా అవకాశాలు మాత్రం అంతంత మాత్రమే..

ప్రియాంక మోహన్.. చేసింది తక్కువ సినిమాలే కాకపోతే స్టార్ హీరోల సరసన నటించి మెప్పించింది ఈ అమ్మడు. తొలి సినిమానే నేచురల్ స్టార్ నానికి జోడీగా నటించింది. నాని గ్యాంగ్ లీడర్ సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. అలాగే ఈ చిన్నదానికి మంచి మార్కులు పడ్డాయి. దాంతో ఈ బ్యూటీకి ఆఫర్స్ క్యూ కట్టాయి. ఆతర్వాత శర్వానంద్ తో కలిసి శ్రీకారం అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. దాంతో తమిళ్ కు చెక్కేసింది. అక్కడ వరుసగా సినిమాలు చేసి హిట్స్ అందుకుంది. శివకార్తికేయన్, సూర్యలాంటి హీరోలతో కలిసి నటించింది ఈ చిన్నది. ఇక ఇక తిరిగి తెలుగులో నానితో కలిసి సరిపోదా శనివారం అనే సినిమా చేసింది. ఈ మూవీ సూపర్ హిట్ అయ్యింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో కలిసి ఓజీ సినిమాలోనూ నటించింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ అయ్యింది. అయితే కూడా ఈ అమ్మడికి చెప్పుకోదగ్గ ఆఫర్స్ రావడం లేదు.



# ఫస్ట్ సినిమాలోనే 17 లిప్ లాక్స్..

సినిమాల్లో రొమాంటిక్ సీన్స్ అనేవి చాలా కామన్.. రీసెంట్ గా వస్తున్న సినిమాల్లో రొమాంటిక్ సీన్స్ అనేవి ఎక్కువైపోతున్నాయి. కనీసం లిప్ లాక్ సీన్స్ అయినా ఉంటున్నాయి. రొమాంటిక్ సీన్స్ చేయడానికి హీరోయిన్స్ కూడా వెనకడుగు వేయడం లేదు. చాలా మంది హీరోయిన్స్ గ్లామరస్ పాత్రలు చేయడానికి రెడీగా అవుతున్నారు. కొంతమంది సినిమాలో పాత్ర కోసం ఎలాంటి సాహసం చేయడానికైనా వెనకాడటం లేదు. దాదాపు అందరు హీరోయిన్స్ రొమాంటిక్ సీన్స్ లో నటించిన వారే. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న హీరోయిన్ అయితే తొలి సినిమాలోనే ఏకంగా 17 లిప్ కిస్ సీన్స్ లో నటించింది. అంతే కాదు స్టార్ డమ్ కూడా సొంతం చేసుకుంది. ఆతర్వాత కూడా రొమాంటిక్ సీన్స్ లో నటించి రెచ్చిపోయింది. హాలీవుడ్ లోనూ నటించింది ఆ ముద్దుగుమ్మ. ఇంతకూ ఆ అందాల భామ ఎవరో తెలుసా.?

### నా వయసున్న అనుష్క, త్రిష హీరోయిన్స్ గా చేస్తున్నారు.. నేను మాత్రంఅలాంటి పాత్రలు చేస్తున్నా..

ఆమె మరెవరో కాదు హీరోయిన్ మల్లికా షెరావత్. ఒకప్పుడు ఈ బ్యూటీకి ఉన్న క్రేజ్ గురించి చెప్పక్కర్లేదు. కుర్రకారు పది చచ్చిపోయేవారు. గ్లామర్ పాటలతో కుర్రాళ్లకు కునుకు లేకుండా చేసింది. ఈ బ్యూటీ సినీప్రయాణం గురించి తెలిస్తే షాక్ అయిపోతారు. మల్లికా షెరావత్ 2000ల ప్రారంభంలో అత్యంత డిమాండ్ ఉన్న హీరోయిన్. ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండానే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి తనదైన ముద్ర వేసింది ఈ వయ్యారి భామ

### నా కొడుకు బ్రతుకు తెరువు చూపించింది ఆయనే.. స్టార్ డైరెక్టర్ గురించి గోపరాజు రమణ

ఒకప్పుడు బాలీవుడ్ సినిమాల్లో గ్లామర్ క్వీన్ గా రాణించింది. స్పెషల్ పాటలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. ప్రస్తుతం ఆమె వయసు 49 సంవత్సరాలు. ఇప్పటికీ ఏమాత్రం తరగని అందం, ఫిట్నెస్ లుక్ తో ఆశ్చర్యపరుస్తుంది. అయితే మల్లికా నటించిన తొలి సినిమాలనే రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయింది. 2003లో ఖ్వాహిష్ అనే సినిమాతో పరిచయం అయ్యింది. ఈ సినిమాలో రొమాంటిక్ సీన్స్ లో ఆకట్టుకుంది. ఈ సినిమాలో ఏకంగా 17 లిప్ లాక్ సీన్స్ లో నటించి కవ్వించింది. ఇప్పుడు సోషల్ మీడియాలో ఈ అమ్మడు చాలా యాక్టివ్ గా ఉంటుంది. సినిమాల్లో పెద్దగా యాక్టివ్ గా లేకపోయినా నెట్టింట తన అందాలతో కవ్విస్తుంది ఈ హాట్ బ్యూటీ.



# 18 ఏళ్లకే తల్లి పాత్ర..

## ధురంధర్ నటిపై ప్రశంసలు

సాధారణంగా హీరోయిన్లు ఎక్కువగా గ్లామర్ పాత్రలే చేస్తుంటారు. నటనకు స్కోప్ ఉండే పాత్రలు రేర్‌గా వస్తుంటాయి. అలా వచ్చినప్పుడే కొంతమంది తమ టాలెంట్‌ని నిరూపించుకుంటారు. అయితే అందులోనూ తమ వయసు తగ్గ పాత్రలనే ఎంచుకుంటారు. ముఖ్యంగా తల్లి పాత్రలు చేయాల్సి వస్తే సీనియర్ హీరోయిన్లు సైతం ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారు. 30 ఏళ్లు దాటినా.. తల్లి పాత్ర చేయమని అడిగితే నో చెప్పే హీరోయిన్లు చాలామందే ఉన్నారు. కానీ సారా అర్జున్ మాత్రం 18 ఏళ్లకే తల్లి పాత్ర చేసింది. అది కూడా 40 ఏళ్ల వయసు ఉన్న హీరో నటించిన పాన్ ఇండియా సినిమాలో. అదే ధురంధర్ 2.

ధురంధర్ సినిమా సమయంలో సారాపై పెద్ద ఎత్తున ట్రోల్ నడిచింది. 40 ఏళ్ల వయసు ఉన్న హీరో(రణ్‌వీర్ సింగ్)తో రొమాన్స్ చేయబోతుందంటూ ఆమెను విమర్శిస్తూ పోస్టులు పెట్టారు. కానీ ధురంధర్ రిలీజ్ తర్వాత అందరూ ఆమెపై ప్రశంసలు కురిరించారు. చిన్న పిల్ల అయినా బాగా నటించిందని అభినందించారు. అయితే పార్ట్ 1లో కేవలం హీరో ప్రియురాలి పాత్రలో కనిపించిన సారా.. పార్ట్ 2 మాత్రం ఓ బిడ్డకు తల్లిగా నటించి, మెప్పించింది. ప్రస్తుతం సారా వయసు 20 ఏళ్లు. ధురంధర్ షూటింగ్ సమయంలో ఆమె వయసు 18 ఏళ్లు మాత్రమే. అంత చిన్న వయసులో తల్లి పాత్ర ఒప్పుకొని సారా పెద్ద సాహసమే చేసింది.

కథపై నమ్మకంతోనే సారా ఆ పాత్ర చేసేందుకు అంగీకరించిందట. తల్లి పాత్ర ఉంటుందని చెప్పగానే ఏమాత్రం సంకోచించకుండా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందట. ఈ విషయాన్ని ధురంధర్ సినిమా కాస్టింగ్ డైరెక్టర్ ముకేష్ చబ్రా చెప్పారు. 'పార్ట్ 2లో తల్లి పాత్ర పోషిస్తున్నానా అనే విషయాన్ని కూడా సారా అడగలేదు. కథ విని వెంటనే ఓకే చెప్పింది. దీంతో ఆమెకు లుక్ టెస్ట్ చేశాం. నేను చేసిన లుక్ టెస్ట్‌లోనూ సారానే ది బెస్ట్ అనిపించింది. అందుకే ఆ పాత్రకు ఎంపిక చేశాం' అని ముకేష్ అన్నారు. కాగా, ధురంధర్ కాస్టింగ్‌పై అంతా ప్రశంసలు కురిపిస్తున్నారు. సినిమాలోని ప్రతి పాత్రకు సరైన నటుడిని ఎంచుకున్నారని, తెరపై చూస్తుంటే వారు తప్ప వేరే నటుడు అలా చేయరేమో అన్నట్లుగా పాత్రలను తీర్చిదిద్దారంటూ సినిమా చూసినవాళ్లు చెబుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com